

నేటి నుంచి హోం ఓటింగ్

» 4, 5 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 2 : జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. కదలలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు హోం ఓటింగ్ విధానాన్ని కొత్తగా ప్రవేశ పెట్టామన్నారు. హోం ఓటింగ్‌కు జిల్లాలో 926 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికల సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్ళి హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలీసులు, పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అత్యవసర సేవల విభాగం సిబ్బంది ఈనెల 4, 5 తేదీల్లో ఆయా నియోజకవర్గాల ఫెసిలిటేషన్ కేంద్రాల్లో వినియోగించుకోవచ్చన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఇవే..

- ఉంగుటూరు నియోజకవర్గం- నారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్
- దెందులూరు నియోజకవర్గం- పెదపాడు మండలం వట్లూరులోని సర్ సీఆర్‌ఆర్ మహిళా కళాశాల
- ఏలూరు నియోజకవర్గం- ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల
- పోలవరం నియోజకవర్గం- కోటరామచంద్రాపురంలోని ఐటీడీఏ కార్యాలయం
- చింతలపూడి నియోజకవర్గం- చింతలపూడిలోని గురుభట్లగూడెం రోడ్డులోని జడ్పీ బాలికల హైస్కూల్
- నూజివీడు నియోజకవర్గం- నూజివీడు లోని ట్రిపుల్ ఐటీలోని ఏబీ-1 బ్లాక్
- కైకలూరు నియోజకవర్గం- పాత తహసీల్దార్ కార్యాలయం

పెన్షన్ పాట్లు!


ముదినేపల్లి ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద ఎండలో పెన్షనర్లు

మండుటెండలో వృద్ధుల పడిగాపులు

- » పెన్షన్‌దారులతో బ్యాంకులు కిటకిట
- » కొన్ని బ్యాంకుల్లో అదనపు చార్జీలు వసూలు..
- » మరికొన్నిచోట్ల లోన్ బకాయిలకు జమ
- » ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా నిరసన
- » ఖాతాలకు జమ చేయకుండా నేరుగా చేతికి ఇవ్వాలంటూ డిమాండ్
- » ఓట్ల కోసం వైసీపీ రాజకీయ చర్యగా విమర్శలు

పింఛన్ల సొమ్ము తీసుకోవడానికి లబ్ధిదారులు పడరాని పాట్లు పడ్డారు. పింఛన్ సొమ్ములను ఈనెల బ్యాంకులో వేయడంతో ఆ సొమ్ము తీసుకోవడానికి బ్యాంకుల దగ్గర పడిగాపులు కాశారు. ఒకేసారి వందల మంది బ్యాంకులకు చేరడంతో బ్యాంకుల వద్ద క్యూ లైన్లు తప్ప లేదు. అందులో గురువారం జిల్లాలో 45 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో బ్యాంకుల వద్ద తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మండుటెండలో వృద్ధులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

ఏలూరు సిటీ/ముదినేపల్లి/ పోలవరం/చాట్రాయి/ పెదవేగి/ ఉంగుటూరు/ ముసునూరు/ కైకలూరు/ లింగపాలెం/ చింతలపూడి, మే 2 : పెద్దవయస్సు వారికి, ఇంటి నుంచి బయటకు రాలేని వారికి ఇంటివద్దకే పింఛను ఇస్తామని చెప్పిన అధికారులు క్షేత్రస్థాయికి వచ్చేసరికి వృద్ధులను ఇబ్బందులకు గురిచేశారు. ప్రభుత్వం ఈనెల పెన్షన్ సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమ చేయడంపై పెన్షన్‌దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం, పంచాయతీ ఉద్యోగులతో ఇంటివద్దే పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్న వైసీపీ ప్రభుత్వం కావాలనే బ్యాంకుల్లో పెన్షన్ నగదు వేశారని లబ్ధిదారులు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని సైతం రాజకీయం చేస్తున్నారని పలువురు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు పింఛన్ సొమ్ములు డ్రా చేసుకునేటప్పుడు ఎటువంటి చార్జీలు వసూలు చేయరాదని అన్ని బ్యాంకులకు తెలిపామని లీడ్ బ్యాంకు అధికారులు చెబుతున్నా కొన్ని ప్రాంతాల్లో అదనపు చార్జీలు వసూలు చేసినట్టు కొంతమంది లబ్ధిదారులు ఆరోపించారు. లోన్ బ్యాంకు ఖాతాలైన ఎన్‌పీఏ అకౌంట్ల విషయంలో ఏ పరిశీలన చేయకుండా పింఛన్ సొమ్ములు తగ్గించి ఇచ్చారని చెబుతున్నారు.


ఎల్.ఎన్.డీ.పేట సచివాలయం వద్ద వేచిఉన్న వృద్ధులు

- ముదినేపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి చెందిన ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద వృద్ధులు మండు టెండలో బారులు దీరారు. అల్లూరు లోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్, శ్రీహరిపురం యూనియన్ బ్యాంక్, పెదగొన్నూరు ఇండియన్ బ్యాంకుల్లో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు సొమ్ము తీసుకునేందుకు వచ్చారు. చాలా మంది పెన్షనర్ల అకౌంట్లను తిరిగి యాక్టివేట్ చేయాల్సి వచ్చింది.
- పోలవరం మండలం ఎల్.ఎన్.డీ.పేట సచివాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులు ఉదయం నుంచి పెన్షన్ సొమ్ముల కోసం ఎదురుచూసి స్థానికంగా ఉన్న ప్రైవేటు పేటీఎం బ్యాంకుల వద్ద బారులు దీరారు. పెన్షన్ సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమ చేయడం వల్ల ఐదు కిలోమీటర్ల దూరంలోని తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి ఆంధ్రా బ్యాంకుకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- చాట్రాయిలో భారతీయ స్టేట్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, కేడీసీసీ బ్యాంకు, చనుబండ, కోటపాడు ఇండియన్ బ్యాంకులకు పెన్షన్‌దారులు భారీగా తరలివచ్చారు. మండలంలో 8,550 మంది పెన్షన్‌దారులు ఉండగా సాయంత్రానికి 94 శాతం మందికి పెన్షన్లు పంపిణీ జరిగినట్టు ఎంపీడీవో మంగాకుమారి తెలిపారు.
- పెదవేగి, ఉంగుటూరు మండలాల్లో బ్యాంకులు తెరిచే సమయానికి కంటే ముందే బ్యాంకుల దగ్గరకు చేరుకుని సొమ్ము తీసుకోవడానికి పింఛన్‌దారులు వేచి ఉన్నారు. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడ్డారు.
- ముసునూరు మండల వ్యాప్తంగా ఉన్న బ్యాంక్‌లు, బీసీ పాయింట్లు పెన్షన్‌దారులతో కిటకిటలాడాయి. అయా చోట్ల సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

2.05 లక్షల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ

జిల్లాలో 2,68,886 మంది లబ్ధిదారులకు రూ. 80.63 కోట్లు రెండు విధాలుగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ఒకటి పింఛన్ దారుని ఆధార్‌కార్డుకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు డీబీటీ ద్వారా సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఈ విధంగా 2,05,548 మందికి రూ. 61.67 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు లీడ్ బ్యాంకు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 35 బ్యాంకులకు సంబంధించి 300 బ్యాంకు బ్రాంచిలు ఉన్నాయి. అయితే డీబీటీ ద్వారా కవర్ చేయబడని మిగిలిన లబ్ధిదారులు 64,338 మందికి రూ.18.96 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమం ప్రారంభించగా 80 శాతం మందికి పైగానే అందజేశారు.


చాట్రాయి ఎస్‌బీఐలో పెన్షన్ లబ్ధిదారులు



- కైకలూరులోని బ్యాంకుల వద్దకు పింఛన్‌దారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనేకమంది లబ్ధిదారుల ఖాతాలకు ఆధార్, ఫోన్ నెంబరు అనుసంధానం కాకపోవడంతో బ్యాంకు అధికారులు వారిని అనుసంధానం చేసుకోవా లని అంక్షలు విధించారు. దీంతో వారు మరలా వారి గ్రామా లకు వెళ్లి సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొచ్చి అందించారు. తీవ్ర అనారోగ్యంతో మంచంమీద ఉన్న లబ్ధిదారులకు అధికారులు ఇంటివద్దనే అందిస్తామని చెప్పినా ఆ విషయం వారికి సరిగ్గా సమాచారం అందించక పోవడంతో కుటుంబసభ్యులు వృద్ధులను బ్యాంకుకు తీసుకొచ్చిన దృశ్యాలు సైతం కన్పించాయి.
- లింగపాలెం మండలంలోని పెన్షన్‌దారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. మండలంలో 22 గ్రామాలకు రంగాపురం, లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో మూడు బ్యాంకులు మాత్రమే ఉండడంతో పెన్షన్‌దారులు పెన్షన్ సొమ్ము డ్రా చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ రుణాలు, తదితర బకాయిలకు పెన్షన్ నగదు జమ చేశామని బ్యాంకు ఉద్యోగులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- చింతలపూడి మండలంలో బ్యాంకుల వద్ద పెన్షన్‌దారులు పడిగాపులు కాశారు. వృద్ధులు, మహిళలు ఎండను తాళలేక బ్యాంకుల్లో రద్దీగా ఉండడంతో బ్యాంకుల్లోనే కూర్చున్నారు. యర్రగుంటపల్లి, సీతానగరం, రాఘవాపురం, ప్రగడవరం గ్రామాల్లో తప్ప ఎక్కడా బ్యాంకులు లేవు. దీంతో 19 పంచాయతీల్లోని పెన్షన్‌దారులు ఆయా బ్యాంకుల వద్దకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించారు.


కైకలూరులో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

నేడు కైకలూరులో పవన్ కల్యాణ్ బహిరంగ సభ

కైకలూరు, మే 2: జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం కైకలూరులో పర్యటించనున్నారు. ఆయన ఉదయం పిఠాపురం నుంచి నేరుగా హెలికాప్టర్‌లో కైకలూరు చేరుకుంటారు. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి తాలుకా సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ మేరకు ఎక్కడికక్కడా కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్ స్థలాన్ని గురువారం మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తాడినాడ బాబు తదితర నాయకులు పరిశీలించారు. కాగా కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పవన్ కల్యాణ్, మెగా ఫ్యామిలీ అభిమానులందరూ పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో గతంలో పవన్‌కల్యాణ్ నిర్వహించిన సభల కంటే ఈ సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు నరసాపురంలో జగన్ ఎన్నికల ప్రచారం

నరసాపురం, మే 2 : ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం నరసాపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని టైలర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారన్నారు. అక్కడ నుంచి స్టీమర్‌రోడ్డులోని క నకదుర్గ ఆర్చ్ వరకు బస్సు యాత్రం చేస్తారన్నారు. అక్కడ సభలో ప్రసంగిస్తామరన్నారు. తిరిగి 11.30 గంటలకు బయలుదేరి వెళ్లిపోతారన్నారు. ఇటు సీఎం పర్యటనకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు. గురువారం సాయంత్రానికి బందోబస్తు నిమిత్తం పెద్ద ఎత్తున పోలీసులు పట్టణానికి చేరుకున్నారు. ఎస్పీ అజిత, ఎఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీనివాసరావులు హెలిప్యాడ్, స్టీమర్ రోడ్డులను పరిశీలించారు.

ఎంతిస్తారు, ఎప్పుడిస్తారు..!



మూడా...నాలుగా...మనిషి వస్తాడు.. మీకో కవరు అందుతుంది... మీ ఇంటిలో ఎవరికైనా ఫోన్ పే ఉందా.. ఉంటే సరే సరి ఇబ్బంది లేదు.. డ్వాక్రా వాళ్ళు ఉన్నారా..? వాళ్ళ వైపు నుంచి కూడా తీసుకున్నారా...అంతా లెక్క ప్రకారం ఉంటుంది.. బయట అమ్మలక్కలకు చెప్పకండి.. ఒకవేళ చెబితే గేలి చేస్తారు.. మీ పాత వలంటీర్ కనబడితే ఓమారు గుర్తు చేయండి.. ఇది నియోజకవర్గాల్లో ఎన్నికల్లో తాయిలాలు పంపిణీకి రోజూ జరుగుతున్న తంతు..

- » ఇప్పటికే ఊళ్లల్లో జనం ఆరాటం
- » అభ్యర్థులది ఇంతకంటే దూకుడు
- » మీ ఇంటిలో ఎన్ని ఓట్లు ఉన్నాయంటూ ఆరా
- » వయో వృద్ధులు.. మహిళలే టార్గెట్‌గా ఇప్పటికే ఎర
- » రూ.1000 నుంచి రూ.1500 వరకు చెల్లింపు..?
- » రాబోయే వారంలోపు సర్దుబాటుకు పక్కా ప్లాన్..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పోలింగ్‌కు మరో పది రోజులే గడువు ఉండగా ఇప్పటికే ప్రచారంలో అభ్యర్థులంతా గడపగడపకు తిరిగారు. మేనిఫెస్టోలో ఉన్న వరాలు జనాలకు చెప్పారు. ఓటేయమంటూ ప్రాధేయపడ్డారు. ఆ వెనుకే మిగతా పని పూర్తి చేయాలని తహతహలాడుతున్నారు. సాధ్యమైనంత మేర పోలింగ్‌కు రెండు రోజులు ముందుగానే గట్టిగా పంపిణీ వ్యవహారం పూర్తి చేయాలని యోచిస్తున్నారు. వైసీపీది మరీ దూకుడు. అధికార వైసీపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే భారీగా నగదు, బహుమతులు పంచుతారంటూ విస్తృత ప్రచారం సాగింది. దీనికి తగ్గట్టుగానే జిల్లాలో ఒక్కొక్క ఓటును రూ.వెయ్యి నుంచి రూ.1500లకు కొనుగోలు చేయబోతున్నారంటూ గడిచిన పక్షం రోజులుగా ఆనోటా.. ఈ నోటా జనం మధ్యకు పాకింది. బలమైన కొన్ని అసెంబ్లీ స్థానాల్లో పెద్ద ఎత్తున కరెన్సీ కొందరి నివాసాల్లో డంప్ చేశారని, పోలింగ్‌కు వారం ముందుగానే ఇవి పంపకానికి తరలించి ఓటుకు వెయ్యి నుంచి 3 వేలు ఇస్తారంటూ ఇంకో ప్రచారం. సాధారణంగా ఎన్నికల ప్రచారంలోనే వైసీపీ నాయకులు తమకు అనుకూలురైన వారందరికి నగదు, మద్యంతో ముంచెత్తుతున్నారు. కొంతమందికి రోజూ వారీ ఖర్చులు నిమిత్తం రూ.500 నుంచి 1500 ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే లక్ష ఓట్లు తగ్గకుండా రూ.వెయ్యి నుంచి రూ.1500 చెల్లించడానికి ఆ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు మరో ప్రచారం సాగుతోంది. ఇవన్నీ కూడా అధికార పక్షానికి కొంచెం తలనొప్పిగానే మారాయి. టైం దగ్గరపడింది కదా.. పంపిణీ ఎలా చేద్దాం.. ఎంతెంత ఇద్దాం.. జనం ఒక్కటే గోల.. ఎంత ఇస్తారంటూ బహిరంగానే నిలదీస్తున్నారు.. అంటూ తమ నేతలకు సీనియర్లు చెవినేసే పనిలో పడ్డారు.

మహిళలు, వృద్ధులకు గాలం

మహిళా పొదుపు సంఘాలను దాదాపు అందరూ టార్గెట్ పెట్టుకున్నారు. మహిళా గ్రూపు సమావేశాలు ప్రతినెలా 1 నుంచి 8వతేదీ లోపు జరుగుతాయి కాబట్టి ఆలోపే ఒక్కొక్క గ్రూపునకు లెక్క కట్టి మరీ ముందస్తుగా అందజేసే ప్రయత్నాల్లో కొన్ని పార్టీలు ఉన్నాయి. వైసీపీ ఇప్పటికే చొరవ తీసుకున్నట్టు కనిపిస్తోంది. మహిళా పొదుపు సంఘాలు ఎక్కడ సమావేశం కావాలని వారిలో వారు చర్చించుకున్న తర్వాత వారు ఎంత మొత్తం ఆశిస్తున్నారో.. తామెంత ఇవ్వదలచామో వారి చెవిన వేస్తున్నారు. ఒక్కొక్క మహిళా గ్రూపులోనూ పది నుంచి 12 మంది సభ్యులుంటారు కాబట్టి రూ.పది వేలు తక్కువ కాకుండా రూ.15 వేలుకు మించకుండా చెల్లించేందుకు కొందరు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అన్ని గ్రూపులకు డబ్బు పంపిణీకి రంగం సిద్ధం చేసినట్టు కొందరు ఫిర్యాదులకు దిగుతున్నారు. ఈ తరుణంలో పోలీసులకు ఉప్పు అందితే మహిళా సంఘాలు సమావేశాలు వాయిదాలు పడుతున్నాయి. ఏలూరుతో సహా మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ అనుకూలురైన మహిళలు కొందరు ఏదో వారు ఇస్తామంటున్నారు.. తీసుకోకపోతే ఇంకో తంతు.. సైలెంట్‌గా తీసుకుంటే గొడవ ఉండదంటూ కామెంట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రెండు లక్షలు పైగానే ఉన్న మహిళా గ్రూపులను టార్గెట్‌గా ఎంచుకుని పంపిణీకి ప్లాన్ చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని సంఘాలకు వారు అడిగినంత మేర సొమ్ము అందజేసినట్టు వినికిడి. ఇంకో వైపు వయో వృద్ధులను వదలకుండా ముందుగానే జాగ్రత్తపడుతున్నారు. వృద్ధులందరికి రూ.1500 చొప్పున ఓటుకు రేటు కట్టి మరి పంపిణీకి సిద్ధమైనట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఎవరెంతటవారు మా పేర్లు బయటకు చెప్పకండి అంటూ ముసుగు వేసుకోవడం ఈ సారి ఎన్నికల్లో హైలెట్.

సామాజిక వర్గాలకు వల

సామాజిక వర్గాల వారీగా ఓటర్లను గుర్తించి సామాజిక వర్గ పెద్దలతోనే ఓటుకు నోటు పంపిణీ చేసేందుకు పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. ఎలాగూ ఎన్నికల సంఘం ఒక కన్నేసి ఉంచినందున పెద్ద మొత్తంలో నగదు తీసుకుని ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయడం కుదరదని భావించి ఇప్పుడు ఆయా ప్రాంతాలను ఎంచుకొని సామాజిక వర్గ పెద్దలతోనే పని పూర్తి చేసేందుకు యోచిస్తున్నారు. కూటమి అభ్యర్థుల ఎదుట ఇప్పటికే ఆయా సామాజిక వర్గాలు నేరుగానే తమ డిమాండ్లను ప్రస్తావిస్తున్నారు. వైసీపీ ఇంత ఇస్తాను.. అని చెబుతుంది. మీరు ఎంత ఇస్తారు.. ఎప్పుడు ఇస్తారు. అంటూ ప్రశ్నించడం అభ్యర్థులంతా విస్తుపోయేలా చేస్తోంది.

ఈసారి అదేదీ?

గతంలో ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా నగదు, మద్యం పంపిణీ జరిగేది. ఇప్పటికే ప్రభుత్వం మద్యం దుకాణాల్లో సరుకును కట్టడి చేసింది. మరోవైపు అధికార వైసీపీ మాత్రం 'మందు'చూపు ప్రదర్శించి మూడు నెలలు ముందుగానే ఎక్కడికక్కడ క్వార్టర్ బాటిళ్లను డంప్ చేసినట్టు చెబుతున్నారు. తగినంత మందు సిద్ధంగానే ఉంది. ఆరోజు ఇస్తాంలే అంటూ మందుకోసం డిమాండ్ చేస్తున్నవారిని స్థానిక నేతలు కట్టడి చేస్తూ వస్తున్నారు. ప్రధాన పక్షాలే కాదు ఇండిపెండెంట్‌లు తమ స్థోమత మేరకు ఓటరుకు వల వేసే ప్రయత్నంలో ఉన్నారు. చింతలపూడి, పోలవరం వంటి నియోజక వర్గాల్లో మందుకు బదులుగా నగదు ఇవ్వాలని గ్రామాల వారీగా ఎమ్మెల్యే అభ్యర్థులకు కబురు పంపుతున్నారు. ఈనెలా ఎలాగూ పింఛన్ల వ్యవహారం గందరగోళంగా ఉంది. కాబట్టి వీలైతే వారిని మచ్చిగ చేసుకుని ఓటును రాబట్టుకోవడానికి పంపిణీ ప్రారంభించాలని అధికార పక్షం భావిస్తోంది.


ప్రచార ర్యాలీలో ధర్మరాజు, గన్ని

కూటమి విజయమే లక్ష్యం

» ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

భీమడోలు/ ఉంగుటూరు, మే 2 : కూటమి విజయమే లక్ష్యంగా జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు కలిసి ముందుకు అడుగులు వేయాలని ఏలూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భీమడోలు మండలం గుండుగొలను, భీమడోలు, ఉంగుటూరు మండలం నారాయణపురంలో గురువారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో 'జనంలోకి ధర్మరాజు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మరాజు, గన్ని ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్ళి ఓట్లను అభ్యర్థించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి, రాష్ట్ర భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. వైసీపీ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కనుచూపు మేర కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆంధ్రరాష్ట్ర దుస్థితిని చూస్తే పక్క రాష్ట్రాల్లో ప్రజలు జాలి పడే పరిస్థితి వైసీపీ తీసుకొచ్చిందన్నారు. కుల వృత్తుల వారి పరిస్థితులను ఆరా తీశారు. రజకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేతి వృత్తుల వారికి ఆదరణ పథకం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల అధ్యక్షులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ మండల, గ్రామ స్థాయి నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఇదేమిటి..స్వామీ!

- » తూర్పుగోపురం మినహా.. అన్నిదారులు మూసివేత
- » భద్రతా చర్యలంటున్న అధికారులు..
- » ద్వారకా తిరుమలలో ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

ద్వారకా తిరుమల, మే 2: భద్రతా చర్యల సాకుతో ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలోని తూర్పురాజగోపురం మినహా అన్ని గోపురాల దారులు మూసి వేయడంతో భక్తులతో పాటు ఆలయ సిబ్బంది, గ్రామస్థులు ఇబ్బం దులు పడుతున్నారు. సింగిల్ ఎంట్రీ, సింగిల్ ఎక్జిట్ పేరుతో తీసుకున్న ఈచర్యలు ఎవరికీ మింగుడు పడడం లేదు. ఇప్పటి వరకు భక్తులు, సిబ్బంది ఆలయంలోకి ప్రవేశించాలంటే తూర్పు రాజగోపురం నుంచే కాకుండా పాత కేశఖండన శాల వద్ద ఆలయ పడమర రాజగోపురం వైపు నున్న నల్లరాతి మెట్లు మార్గం, శివాలయానికి వెళ్లే మెట్ల మార్గం, హరిణి కల్యాణ మండపం వద్ద మెట్ల మార్గం వాడుకలో ఉండేవి. దీంతో అందరికీ వెసులు బాటుగా ఉండేది. అయితే తాజాగా ఆలయ భద్రతా చర్యలు అంటూ ఈ మార్గాలన్నీ మూసి వేయడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఆలయ ఈఓ త్రినాథరావు మాట్లాడుతూ సెక్యూరిటీ ఆడిట్‌లో దేవాలయ భద్రత దృష్ట్యా చేసిన సూచనల ప్రకారమే ప్రస్తుత చర్యలు తీసుకున్నామన్నారు.


గేట్లు మూసిఉన్న పాత కేశఖండనశాల వద్ద ఉన్న నల్లమెట్ల దారి

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు కత్తితో దాడి..

మండవల్లి, మే 2 : మండలంలోని పెరికేగూడెంలో టీడీపీ కార్యకర్తపై గురువారం రాత్రి వైసీపీ కార్యకర్తలు కమ్మ కత్తితో దాడి చేశారు. పెరికేగూడెంలో రేషన్ డీలర్ భర్త పెరుమాళ్ల రమేష్ ఇటీవల బీజేపీలో చురుగ్గా తిరుగుతున్నాడు. దీంతో వైసీపీకి చెందిన అయ్యవారిరుద్రవరానికి చెందిన కుంచె నాగయ్య, అతని కుమారుడు చక్రి గురువారం రాత్రి 9.30 గంటలకు రమేష్ ఇంటికి వెళ్లి నువ్వు బీజేపీలో తిరగడానికి వెళ్లవద్దంటూ బెదిరించారు. అయినప్పటికీ మాట వినకపోవడంతో తనతో తెచ్చుకున్న కత్తితో దాడి చేసి హత్య చేయబోయారు. రమేష్ చెయ్యి అడ్డు పెట్టడంతో అర చేతికి తీవ్రగాయమైంది. బాధితుడు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై టీడీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


గాయపడిన రమేష్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పరిశీలకులు

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

పెదపాడు, మే 2 : జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా వట్లూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్, ఎస్పీ డి.మేరీప్రశాంతి, జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టరు కృష్ణకాంత్ పాఠక్, ఎస్.ఎ.రామన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయి భద్రతా, సౌకర్యాలపై సంబంధింత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపునకు అనువైన సౌకర్యాలపై ఆరా తీశారు. లెక్కింపు టేబుల్స్, పోలింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం, చుట్టు పక్కల శాంతి భద్రతల పరిరక్షణ చర్యలను కలెక్టర్ పరిశీలకులకు వివరించారు. బస్‌రూట్లు, వాహన పార్కింగ్, పోలింగ్ సామగ్రిని తీసుకునే స్టాల్స్, బ్యాలెట్ బాక్సులు, ఈవీఏఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూంలు, మైక్రో అబ్జర్వర్లు వేచిఉండే గదులు, భోజన స్టాల్స్ కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, మీడియా సెంటర్ తదితర ప్రదేశాలను పరిశీలకులకు చూపించారు. డీఆర్వో పుష్పమణి, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లాలోని నియో జకవర్గ ఆర్వోలు, ఏఆర్వోలు, ఏడీ సర్వే లక్ష్మణరావు, కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నా ఎస్సీలు అంటావ్ కద జగనన్నా..



నా ఎస్సీలు అంటావు కద జగనన్నా.. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గానికి ఏం చేశావని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడికి వచ్చావు అధికారంలోకి వస్తే ఏం చేస్తావో చెప్పలేకపోయావు. అధికారం వచ్చాక కూడా వచ్చావు. ఏం చేశావని ప్రశ్నిస్తున్నారు. పామాయిల్ రైతులకు మొండిచెయ్యే..!

గోపాలపురం
అభివృద్ధిలో వివక్ష



గోపాలపురం నియోజకవర్గంలో ప్రతిపక్ష హోదాలో ఎన్నికల ముందు జగన్ పాదయాత్ర నామమాత్రంగా సాగింది. నియోజకవర్గానికి మేలు చేసే హామీలు లేవు. అధికారంలో ఉండగా మరోసారి వచ్చినా నియోజకవర్గ ప్రజలకు నిరాశే. ప్రతిపక్ష హోదాలో వచ్చిన జగన్ ముందు పామాయిల్ రైతుల ఒక సమస్య ఉంచారు. పామాయిల్ గెలలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అదే కాదు ఒకటి.. అర.. హామీలు కూడా గాలికొదిలేశారు. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో వివక్ష చూపారని, అభివృద్ధిలో చిన్నచూపు చూశారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. హామీలు ఇవ్వడానికే వెనకాడారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఎస్సీలు అంటూ ఊదరగొట్టే జగన్ ఐదేళ్లలో ఏం చేశారని ఎస్సీలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - గోపాలపురం

పామాయిల్ రైతులను పట్టించుకోలేదు



గత ఎన్నికలకు ముందు పాదయాత్రగా నియోజకవర్గానికి వచ్చిన జగన్ వద్ద పామాయిల్ రైతులు సమస్యలు వివరించారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని వాపోయారు. అధికారంలోకి వచ్చాక పామాయిల్‌కు మంచి ధర ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కంటె మన రైతులకు ఎక్కువ ధర ఇస్తామని నమ్మబలికారు. జగన్ హామీతో రైతులు సంబరపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మరిచిపోయారు. పామాయిల్ ధరలు మరింత పతనం కాగా ఇక్కడి రైతులను తెలంగాణ మార్కెట్‌కు రానివ్వలేదు. పామాయిల్ రైతులను జగన్ నిర్లక్ష్యం చేశారని వాపోతున్నారు.

• పామాయిల్ గిట్టుబాటు ధర లేదు • పోలవరం కుడి కాల్వ నిర్వాసిత రైతులకు పరిహారం లేదు • ఎర్ర కాల్వ పనులు లేవు • నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారు

ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన గోపాలపురంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పాదయాత్రలో భాగంగా నియోజకవర్గానికి వచ్చిన జగన్ కనీసం హామీలు కూడా ఇవ్వలేదని ప్రజలు మండిపడుతున్నారు. పామాయిల్‌కు గిట్టుబాటు ధర కావాలని రైతులు నోరు తెరచి అడిగితే తెలంగాణ కంటె ఎక్కువ ఇస్తామని గొప్పగా చెప్పారని, అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపారన్నారు. పోలవరం నిర్వాసితుల్లో భాగమైన కుడికాల్వ తవ్వకాల్లో భూములు కోల్పోయిన రైతులకు రూ.5 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేక జగన్ చేతులెత్తేశారని నియోజకవర్గ ప్రజలు మండి పడుతున్నారు.

పోలవరం కుడి కాల్వపై అసంపూర్తి వంతెన


దేవరపల్లి మండలంలో పోలవరం కుడి ప్రధాన కాల్వపై లక్ష్మీపురం వద్ద టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టింది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక వంతెన నిర్మాణం వైపు ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి చూడలేదు. దేవరపల్లి - లక్ష్మీపురం మధ్య కిలోమీటరు దూరం ప్రయాణానికి చుట్టు తిరిగి 5 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది. రైతులు, విద్యార్థులు, కూలీలు, వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. కోరుమామిడి, చిక్కాల ప్రధాన రహదారి నిర్మిస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పలుమార్లు భూమి పూజలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్నారు. రహదారి నిర్మాణం మాత్రం చేయలేదు.

నిలిచిపోయిన ఎర్ర కాల్వ, కుడికాల్వ పనులు

నల్లజర్ల మండలంలో పోతవరం నుంచి పుల్లలపాడు వరకు ఎర్రకాల్వ, కుడి కాల్వ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆ కాల్వ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో 15కిలోమీటర్ల మేరా 7వేల ఎకరాలకు నీరందక సాగుభూములు బీడుభూములుగా మారాయి. నల్లజర్ల మండల కేంద్రంలో గత టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ నిర్మించింది. తర్వాత రాజమండ్రి - ఏలూరు వెళ్ళే జాతీయ రహదారి నిర్మాణంతో బస్సులు హైవే మీదుగా వెళుతున్నాయి. దీనితో కాంప్లెక్స్‌కు బస్సులు రాక ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు. ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకున్నా వారే లేరు.

మంచినీటికి కటకట

మెట్ట ప్రాంత ప్రజల దాహార్తి తీర్చే శ్రీసత్యసాయి మంచినీటి సేవా పథకం కార్మికులకు ఐదేళ్లుగా జీతాలు లేక విలవిలాడుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 మండలాలకు తాగునీరు సరఫరా అవుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్ల క్రితం కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో సుమారు ఏడాది పాటు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రతిపక్షాల పోరాటాలతో ఎట్టకేలకు పథకం కొనసాగిం చారు. ప్రస్తుతం ఐదు నెలల నుంచి మంచినీటి పథకం కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో నానా తంటాలుపడుతున్నారు.



నల్లజర్లలో ఎర్ర కాల్వ గట్టు పనులు

అధ్వానంగా త్యాజంపూడి - కోరుమామిడి రహదారి

రాళ్లు, గోతులతో ద్వారకా తిరుమల - రాజుపాలెం రహదారి

యర్నగూడెం రోడ్డు (ఫైల్)

నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల మండల రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు ఈ రహదారుల వెంబడి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలతో పాటు పరిసర గ్రామాల రహదారులు గుంతలు పడి, రాళ్లు లేచి కనీసం నడిచేందుకు వీలులేని పరిస్థితిలో ఉన్నాయి. తిమ్మాపురం నుంచి రామన్నగూడెం, తిరుమలంపాలెం నుంచి రాజుపాలెం మీదుగా మారంపల్లి రహదారి, పంగిడిగూడెం - వేంపాడు రహదారులు పూర్తి అధ్వానంగా మారాయి. ఐదేళ్లుగా రహదారుల నిర్మాణం కాదు కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టలేదు.



నల్లజర్లలో అలంకారప్రాయంగా మిగిలిన ఆర్టీసీ బస్టాండ్

నెరవేరని హామీలు

- పామాయిల్ రైతులకు తెలంగాణ కంటె అధిక ధరలు ఇస్తామని జగన్ హామీ ఐదేళ్లుగా అమలుకు నోచుకోలేదు.
- పోలవరం ప్రాజెక్టులో భాగమైన కుడి కాల్వకు భూములు ఇచ్చిన రైతులకు రూ.5లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు.
- దేవరపల్లి మండలంలో పోలవరం కుడి ప్రధాన కాల్వపై లక్ష్మీపురం వద్ద ప్రజల రాకపోకల నిమిత్తం నిర్మించాల్సిన వంతెన నిర్లక్ష్యం చేశారు.
- కోరుమామిడి, చిక్కాల ప్రధాన రహదారి నిర్మిస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పలుమార్లు భూమిపూజలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేసుకున్నారు. పనులు మాత్రం చేపట్టలేదు.
- నల్లజర్ల మండలంలో పోతవరం నుంచి పుల్లలపాడు వరకు ఎర్రకాల్వ, కుడి కాల్వ నిర్మాణం పనులు గాలికొదిలేశారు.
- మెట్ట ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు శ్రీసత్యసాయి మంచినీటి సేవా పథకం కార్మికులకు వేతనాల చెల్లింపులో ముప్పు తిప్పలు పెడుతున్నారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో నల్లజర్లలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు లేవు. ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోరు.
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల మండలంలో రహదారులు అధ్వానం. రహదారుల నిర్మాణంపై ఐదేళ్లుగా పట్టనట్లు గడిపేశారు.

ఎన్నికల ప్రచార సిత్రం

అభిమానం



నరసాపురంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

గబ్బర్‌సింగ్



భీమవరంలో గబ్బర్‌సింగ్ కమెడియన్ల ప్రచారం

RRR సెల్ఫీ



కష్టే ఫలి..





భర్త విజయం కోరుతూ భార్య, తండ్రిని గెలిపించాలని కుమారుడు వినూత్న ప్రచారంతో ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. తణుకు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ భార్య కృష్ణ తులసి, కుమారుడు నిఖిల్ రత్న నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల ప్రచారం చేస్తున్నారు. కృష్ణ తులసి ప్రచారంలో భాగంగా మహిళలను ఓట్లు అభ్యర్థించడానికి వెళ్లి ఒక చోట కుట్టుమిషన్‌పై కొంతసేపు బట్టలు కుట్టి సందడి చేశారు. మరో మండలంలో నిఖిల్ రత్న ఓట్లు అభ్యర్థిస్తూ ఒక చోట లాండ్రిలో ఇస్త్రీ చేసి ఓటర్లను ఆకట్టుకున్నారు.



ఇస్త్రీ చేస్తూ.. ఓట్లు అడుగుతున్న పత్సమట్ల ధర్మరాజు

సైకిల్‌పై కార్మిక



గీత కార్మికుడిగా సైకిల్‌పై నిమ్మల ప్రచారం

జనసేన చీరలు

ఎన్నికల ప్రచారంలో జనసేన చీరలు మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. జనసేన పార్టీ గుర్తుతో పాటు, ఎన్నికల గుర్తు గ్లాస్ ముద్రించిన చీరలు ధరించి మహిళలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆచంటలో జనసేన చీరల మహిళలు ఇలా సందడి చేశారు.





మామ గారిని గెలిపించాలని పితాని కోడలు సాహితి పెనుమంత్ర మండలంలో ప్రచారం చేశారు

Hai చింటూ



ప్రచారంలో చిన్నారితో సరదాగా ఆరిమిల్లి



తోడికోడళ్ల ప్రచారం

ఏలూరులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి విజయానికి కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. కుటుంబంలో తోడికోడళ్లు ఇద్దరూ ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించడంతో మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. చంటి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుకమ్మ, చంటి భార్య మీన కలసి కార్యకర్తలతో పాటు ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేస్తున్నారు. వారికి తోడుగా బుజ్జి అల్లుడు కొట్టు మనోజ్ గత కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కుటుంబమంతా బడేటి చంటి విజయానికి కృషి చేస్తున్నారు. - ఏలూరు టూటౌన్



ఎక్స్‌కవేటర్‌తో రహదారిపై డివైడర్ల తొలగింపు

జగన్ వస్తే.. విధ్వంసమే

నరసాపురంలో డివైడర్ తవ్వేశారు

నరసాపురం, మే 2: ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినా అధికారులు మాత్రం ఇంకా జగన్ మత్తులోనే జోగుతున్నారు. ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురం వస్తున్నారు. స్టీమర్ రోడ్డులో శుక్రవారం వైసీపీ సభ నిర్వహిస్తారు. సభకు అనువుగా రహదారిపై డివైడర్లను గురువారం రాత్రి ఎక్స్‌కవేటర్లతో తవ్వేశారు. కొద్ది రోజుల క్రితం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభలు కూడా అదే రహదారిలో ఏర్పాటు చేశారు. అప్పుడు అడ్డురాని డివైడర్లు జగన్ రెడ్డి సభకు అవరోధం కల్పిస్తున్నాయా అని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హోదాలో వచ్చినప్పుడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగించారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి వస్తున్న జగన్‌కోసం డివైడర్‌లను ధ్వంసం చేశారు. అందుకోసం మున్సిపల్ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను ఉపయోగించారు. దీనిపై జగన్ వస్తే విధ్వంసమేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థి 420..
ఓటు వేస్తే మోసం చేస్తారు

మాజీ సర్పంచ్ కృష్ణవేణి ఆడియో కలకలం

పాలకొల్లు రూరల్, మే 2: పాలకొల్లు వైసీపీ అభ్యర్థి గుడాల గోపి 420.. అతడికి ఓటు వేయవద్దు అంటూ ఒక మాజీ సర్పంచ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి మాట్లాడిన ఆడియో కలకలం రేపింది. ఆచంట నియోజవర్గం శేషమ్మచెరువు మాజీ సర్పంచ్ మామిడిశెట్టి కృష్ణవేణి పాలకొల్లు వైసీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాల రావు (గోపి)పై మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. గోపి తనకు రూ.32 లక్షలు ఇవ్వాలని, తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ము ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గుడాల గోపి 420 అని, ప్రజలు ఎవరూ ఓటు వేయవద్దంటూ కోరారు. తాను యలమంచిలి మండలం కాజ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు గుబ్బల వేణు సోదరినని (గుడాల గోపి సామాజిక వర్గం కూడా అదే) తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మోసగాడికి ఓటు వేయవద్దని.. ఏ పనికైనా డబ్బులు వసూలు చేస్తాడని కృష్ణవేణి విడుదల చేసిన ఆడియో ఇప్పుడు నియోజకవర్గంలో పెను సంచలనం కలిగిస్తోంది.

రాజకీయం

నాడు ప్రత్యర్థులు.. నేడు ఒక్కటై ప్రచారం



రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో...ఎవరూ చెప్పలేరు. శత్రువులు మిత్రులవుతారు. ఒక్కోసారి మిత్రులే శత్రువులై పోటీలో ఉంటారు. ఇలాంటి చిత్ర విచిత్రాలు ఎన్నికల్లోనే చూస్తుంటాం. అలాంటి సంఘటనే నరసాపురంలో చోటు చేసుకుంది. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు నేడు ఒక్కటయ్యారు. గెలుపు కోసం అంతా కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా నాయకర్ పోటీలో ఉంటే టీడీపీ అభ్యర్థిగా బండారు మాధవనాయుడు ఉన్నారు. ఇటు కొత్తపల్లి వైసీపీలో చేరి ముదునూరి విజయం కోసం కృషిచేశారు.అయితే నేడు ఈ ముగ్గురు ఒక్కటయ్యారు. కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న నాయకర్ విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. నాయకర్‌ను గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

-నరసాపురం

పాలిట్రిక్స్

ఎంత పనున్నా ఆ..రోజు రావాల్సిందే..



" ఈసారి ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. మన అభ్యర్థిని తప్పనిసరిగా మనందరం కలిసి గెలిపించుకోవాలి. మీకు ఎంత పని ఉన్నా ఓటు వేసే సమయానికి మాత్రం ఊరులో ఉండాల్సిందే." అంటూ గ్రామాల్లో ఉన్న ఓటర్లను వివిధ పార్టీలకు సంబంధించిన నేతలు ఫోన్‌లు చేసి సమాయత్తం చేస్తున్నారు. ఫోన్ కలవకపతే మెసేజ్‌ల రూపంలో పిలుస్తున్నారు. "ఎపుడూ లేనివిధంగా ఈసారి ఇరు పార్టీల మధ్య ఎన్నికలు హోరా హోరీగా జరుగుతున్నాయి. కాబట్టి ఆ సమయానికి వీలు చూసుకొని ఓటు వేయడానికి రావాల్సిందే." అంటూ పిలుస్తున్నారు. గ్రామంలో ఓటు ఉండి వేరే ప్రాంతాల్లో ఉంటున్నవారిని గుర్తించి వారికి ఫోన్లు చేస్తున్నారు.

-ఆచంట

ఎట్టెట్టా..!

జెండా పట్టండి..సొమ్ములు పొందండి..



నాయకులు ప్రచారానికి వెళితే కార్యకర్తల,అభిమానులకు వెన్నంటి ఉండేవారు. ఎన్నికలంటే పండగలా సాగేది. ఇప్పుడు ఎండలు మండిపోతున్నాయి. ఎవరూ బయటకు రాలేని పరిస్థితి. ప్రచారానికి వెళితే పట్టుమని పదిమంది కూడా ఉండని పరిస్థితి. దీంతో పెయిడ్ వర్కర్లను పురమాయిస్తున్నారు. మహిళలకు రూ.300 ఇస్తున్నారు. రెండు పూటలైతే రూ.600 చేతిలో పెడుతున్నారు. వైసీపీలో ఇటువంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. మహిళలకు డబ్బులిచ్చి ప్రచారానికి రప్పిస్తున్నారు. గతంలో పొలం పనులకు వెళ్లేవారు. ఇప్పుడంతా యంత్రాలతో పని జరిగిపోతోంది. దీంతో ఈ ఎన్నికలు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయి.జెండా పట్టుకుని ప్రచారానికి వెళ్లిపోతున్నారు. సాయంత్రానికి సొమ్ము పెట్టుకుని ఇంటికి వెళ్తున్నారు.

-భీమవరం రూరల్

ఎన్నికళలో..

అన్ని పార్టీలకు అదే గొంతు..





ఎన్నికలైనా, వాణిజ్య ప్రకటనలైనా, ఆధ్యాత్మిక ప్రకటనలైనా ఒకే ఒక్కడు పాలకొల్లులో తన గొంతును పలికిస్తాడు. అతని వాయిస్‌ను పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజక వర్గాల్లో ప్రతీ ఒక్కరూ గుర్తిస్తారు. మనిషి తెలియకపోయినా, మాటను బట్టి గుర్తు పట్టే విధంగా అతని వాయిస్ ఉంటుంది. కంచు కంఠం అని అందరూ అంటుంటారు. అతని పేరు బాలు.ముద్దుగా అందరూ మైక్ బాలు అంటూంటారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు కూడా బాలు వాయిస్‌ను రికార్డ్ చేసి ప్రచార వాహనాల్లో మైక్‌ల ద్వారా వినిపిస్తున్నారు. తెల్లవారగానే బాలు వాయిస్‌తో కూడిన ఎన్నికల ప్రచారం చేసే ఆటో రోడ్లపైకి వస్తుంది. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నిమ్మలకు, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మకు ఓటు వేయాలంటూ ప్రచారం చేసుకుంటూ వెళ్లిన ఐదు నిమిషాల్లో మరో వీధి నుంచి వచ్చిన ఆటోలో అదే గొంతు వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండంటూ ప్రచారం చేస్తూ వస్తుంది.దేవుడు ఇచ్చిన వరం తన గొంతు అని, అది ఇలా పొట్ట కూటికోసం ఉపయోగపడుతోందని బాలు చెబుతున్నారు.

-పాలకొల్లు రూరల్

ఇదీ సంగతి !

రండి బాబు..రండి !



ఎన్నికల ప్రచారానికి అధికార పార్టీకి కార్యకర్తల నుంచి స్పందన కరువైంది. పార్టీలో ఐదేళ్ల నుంచి ఉంటున్నా ఏం ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్నికలప్పుడు కార్యకర్తలు గుర్తుకొస్తున్నారు.. అంటూ పెదవి విరుస్తున్నారు. ప్రచారానికి రావాలంటూ అభ్యర్థులు ఆహ్వానాలు పంపుతున్నా కార్యకర్తల నుంచి మాత్రం స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు ఏం పొందలేక పోయాం.. ఒకవేళ అధికారం కోల్పోతే మారిన ప్రభుత్వంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కొంతమంది కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. మరోపక్క కూటమి అభ్యర్థుల ప్రచారం సందడిగా ఉంటోంది. ర్యాలీలలో వందలాది మంది వస్తున్నారు. అయితే అధికార పార్టీ అభ్యర్థులైతే పట్టుమని 20 మంది కూడా ఉండటం లేదు. దీంతో తాయిలాలు ఎర చూపి ప్రచారానికి ఆహ్వానం పలుకుతున్నారు..అలా అయినాసరే కొద్దిమందే వస్తున్నారు.


- భీమవరం రూరల్

కొల్లేరు కిలకిల..

కైకలూరు నియోజకవర్గం రాజకీయంగా చైతన్యవంతమైనది. ఇప్పటివరకు మూడుసార్లు స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. రెండుసార్లు మంత్రి పదవులు వరించాయి. పార్టీలకన్నా వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తారు ఇక్కడి ఓటర్లు. ఈ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లోని పలు గ్రామాలు బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాలతో ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి మండలం, మండవల్లి మండలం పూర్తిగా కైకలూరు నియోజకవర్గంలోకి చేరాయి. ప్రస్తుతం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంగా కైకలూరు ఉన్నప్పటికీ నేటికి గ్రామ పంచాయతీగానే ఉంది. - కైకలూరు



ఫ్లాష్ బ్యాక్



నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కైకలూరు నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా పేరొందింది. 2009లో పునర్విభజనతో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. 72 సంవత్సరాల్లో 16 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో అత్యధికంగా ఓసీ సామాజికవర్గానికి చెందినవారే గెలుపొందారు. జయమంగళ వెంకటరమణ ఒక్కరు మినహా మిగిలిన వారంతా ఓసీ అభ్యర్థులే. అప్పటికి అత్యధికంగా కనుమూరి బాపిరాజు నాలుగుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఎర్నేని రాజరామచందర్ మూడుసార్లు గెలుపొందారు. కమ్మిలి అప్పారావు రెండుసార్లు, చెన్నంశెట్టి పాండురంగారావు, కమ్మిలి మంగ తాయారమ్మ ఒకసారి, నంబూరి వెంకటరామరాజు ఒకసారి గెలుపొందారు. ముదినేపల్లి మండలం కైకలూరు నియోజకవర్గంలో విలీనం చేయడంతో ఆ మండలంలో ఉన్న బీసీలు, ఓసీ వర్గాలకు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు చూపడంతో పార్టీకి మరింత పట్టు పెరిగింది. దీంతో 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ గెలుపొందగా, 2014లో కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలిచారు. టీడీపీ అధికారం చేజిక్కించుకోవడంతో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో హోరాహోరీగా పోటీపడిన జయమంగళ వెంకటరమణ ఓటమి పాలవ్వడంతో వైసీపీ నుంచి దూలం నాగేశ్వరరావు 9357 ఓట్ల తేడాతో గెలుపొందారు.





- ఆహ్లాదాన్ని అందించే కొల్లేరు పర్యాటకం
- ఆధ్యాత్మికతను చాటే ఆలయాలు
- ఆక్వా ఉత్పత్తులకు ప్రసిద్ధి
- నాలుగు దశాబ్దాలుగా ఎగుమతులు
- రాజకీయంగా చైతన్యవంతం

నియోజకవర్గం : కైకలూరు

మొత్తం ఓటర్లు : 2,05,604
పురుషులు : 1,01,196
మహిళలు : 1,04,404
ఇతరులు : 4
పోలింగ్ బూత్‌లు : 235

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	దూలం నాగేశ్వరరావు	వైసీపీ	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	9,357
2014	కామినేని శ్రీనివాస్	బీజేపీ	ఉప్పాల రాంప్రసాద్	వైసీపీ	21,571
2009	జయమంగళ వెంకటరమణ	టీడీపీ	కామినేని శ్రీనివాస్	ప్రజారాజ్యం	974
2004	ఎర్నేని రాజరామచందర్	కాంగ్రెస్‌ఐ	కమ్మిలి విఠలరావు	టీడీపీ	2,056
1999	ఎర్నేని రాజరామచందర్	ఇండిపెండెట్	గట్టమనేని విజయనిర్మల	టీడీపీ	1,109
1994	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	5,530
1993	ఎర్నేని రాజరామచందర్(ఉప)	టీడీపీ	నంబూరి వెంకటరామరాజు	కాంగ్రెస్	6,562
1989	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	ఎర్నేని రాజరామచందర్	టీడీపీ	10,535
1985	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	పి.ఆదినారాయణమూర్తి	టీడీపీ	5,283
1983	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్‌ఐ	కేవీ రావు	టీడీపీ	803
1978	కనుమూరి బాపిరాజు	ఇండిపెండెంట్	ఎన్.నాగేశ్వరరావు	కాంగ్రెస్‌ఐ	46
1972	కె.మంగతాయారమ్మ	కాంగ్రెస్	జరిమయ్య	ఇండిపెండెంట్	37,312
1967	చెన్నంశెట్టి పాండురంగారావు	ఇండిపెండెంట్	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	1,694
1962	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,351
1955	కమ్మిలి అప్పారావు	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	5,616
1952	ఏపీ సుబ్రహ్మణ్యం	కాంగ్రెస్	ఏపీసీ రావు	సీపీఐ	110

ఆక్వా ఎగుమతులకు ప్రసిద్ధి

నాలుగు దశాబ్దాలుగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ప్రసిద్ధి గాంచిన ప్రదేశంగా కైకలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కైకలూరుకు ఆనుకొని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు ఉండడం ఇక్కడ కొల్లేరు చేపలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. కొల్లేరు చేప పేరు వినగానే మాంస ప్రియులకు నోరూరుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటిగా చేపల పరిశ్రమకు పునాది వేసింది కైకలూరే. పరిశ్రమ రోజురోజుకి అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని తలసరి ఆదాయంలోని మొదటి స్థానంలో కలిదిండి, రెండో స్థానంలో కైకలూరు నిలిచింది.

ఆధ్యాత్మిక శోభ

కైకలూరు గ్రామ నడిబొడ్డున శ్యామలాంబ అమ్మవారు ఆలయం ఉంది. ఇందులో ఒకేచోట మూడు శివాలయాలు ఉండడం ప్రత్యేకత. దీని సమీపానే మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రసద్ధి చెందింది. ఇక్కడ స్వామివారికి మీసాలు ఉండడం విశేషం. కొల్లేరు సరస్సు నడిబొడ్డున కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు నిత్యం భక్తుల నీరాజనాలు అందుకుంటూ ఉంటారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి, ముదినేపల్లి మండలంలో సింగరాయపాలెంలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి.

ఆహ్లాదం.. కొల్లేరు పర్యాటకం

కైకలూరు సమీపాన ఆటపాక పక్షుల కేంద్రం ఉంది. ఇక్కడ వివిధ దేశాల నుంచి వలస పక్షులు ప్రతీ సంవత్సరం కొల్లేరులో సేద తీరుతూంటాయి.ఈ ప్రాంతం పర్యాటకంగా ఎంతో ప్రసద్ధి గాంచింది. ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది పర్యాటకులు కొల్లేరు సరస్సును సందర్శించి పక్షుల విన్యాసాలను తిలకిస్తూంటారు. ఈ వాతావరణం ఎంతో ఆకట్టుకుంటుంది.



ప్రచారానికి వడదెబ్బ

- మండుతున్న ఎండలు
- అస్వస్థతకు గురవుతున్న నాయకులు, కార్యకర్తలు
- ఉదయం, సాయంత్రమే ప్రచారం



కూల్ అవుదాం.. : ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకొల్లు టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు గురువారం గ్రామాల్లో సైకిల్‌పై ప్రచారం నిర్వహించారు. పెదమామిడిపల్లిలో కల్లుగీత కార్మికుడు కల్లు అందించగా కాస్త సేవించి ఎండ నుంచి కూల్ అయ్యారు..

గణపవరం, మే 2: ఒకపక్క ఎన్నికల వేడి.. మరోపక్క వేసవి ఎండలు మండిపోతున్నాయి. పది దాటితే వాతావరణం నిప్పుల కొలిమిలా తయారవుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లాలంటే నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో గతంలో ఉన్నంత ఊపు, ఉత్సాహం ఈ ఎన్నికల్లో కనిపించడం లేదు. ఎండలను లెక్క చేయకుండా ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించిన కొందరు నాయకులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. దీంతో ఉదయం, సాయంత్ర సమయాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగులు కూడా అదే సమయంలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రచార కార్యక్రమాలు నిలుపుదల చేస్తున్నారు. ఆ సమయంలో హాలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండల తీవ్రత గుర్తించి ప్రధాన పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. వడదెబ్బ తగిలితే తమకు ఎవరు అండగా ఉంటారని అక్కడక్కడా కొందరూ కార్యకర్తలు నిలదీస్తుండడంతో పార్టీలు కూడా వారి అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి.



కొబ్బరి బొండాలు తాగుతున్న జనసేన అభ్యర్థి ధర్మరాజు, కార్యకర్తలు

అప్పటి జోష్ ఏది ?

గత ఎన్నికల్లో పోలిస్తే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఆ ఉత్సాహం, సందడి కనిపించడం లేదు. పార్టీ అభ్యర్థులు, ముఖ్య నేతలు వచ్చినప్పుడు మాత్రమే నాయకులు, కార్యకర్తలు కనిపిస్తున్నారు. నాయకుల ఎదుట కనిపించే ఎన్నికల ప్రచార సందడి వారు వెళ్లిపోయాక కనబడకకుండా పోతుంది. ఈ తీరు ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది. ఇంతకు ముందు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే గ్రామాల్లో పట్టణాల్లో రాజకీయ సందడి కనిపించేది. ఎక్కడ నలుగురు కలిసినా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల గురించి చర్చ జరిగేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. తమను పలకరించకపోయినా, తక్కువ చేస్తున్నట్లు అనిపించినా అలిగి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటువంటి వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం నాయకులకు సవాలుగా మారింది.

ఆసక్తి చూపని కార్యకర్తలు

ముఖ్యనేతలు బతిమాలితేనే నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారు. గత ఎన్నికల్లో అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ఓట్లు వేయ్యాలని ఓట్లు అభ్యర్థించేవారు. ఇప్పుడు ఉదయం సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రచారంతో ఎక్కువ మందిని కలవలేకపోతున్నారు. ఉదయం 6 గంటల నుంచి పట్టణాలు, గ్రామాల్లోకి ప్రచార రథాలు వస్తున్నా జనం అంతగా ఆసక్తి కనపరచడం లేదు. ఇంతకు ముందు తమ గ్రామాలకు ఎన్నికల ప్రచార వాహనలు వస్తే ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనించేవారు. మైకుల్లో రికార్డు చేసిన ప్రసంగాలు వినేవారు. ఏ పార్టీ ఏం చెబుతుందనేది గుర్తించేవారు. పార్టీలు చెప్పే అంశాలు, హామీల పైన చర్చ చేసేవారు. ఈ ఎన్నికల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పాటలు పాడుతూ ప్రదర్శనలు ఇస్తున్న ప్రజలు అంత ఆసక్తి చూపడం లేదు.

విస్తృతంగా ఎన్నికల తనిఖీలు

ఏలూరు క్రైం, మే 2 :ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి గురువారం రాత్రి 7 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 23.9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 7,360 రూపాయలు అని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో చేసుకున్న రూ.70 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ దాడులు

ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. మంగళవారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ అధికారులు, చెక్ పోస్టుల వద్ద సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయదారులపై 4 కేసులు నమోదులు చేసి వారి నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2,800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. డ్యూటీ పెయిడ్ లిక్కర్ కల్గి ఉన్న వారిపై 10 కేసులు నమోదు చేసి 70.3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 16 కేసులలో 12 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

అక్రమ మద్యం నియంత్రణకు కంట్రోల్ రూమ్



ఎన్నికల సమయంలో అక్రమ మద్యం నియంత్రణకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరిం టెండెంట్ డాక్టర్ కుమరేశ్వరన్, ఎక్సైజ్ డిపో మేనేజర్ దేవదత్తు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మద్యం, తదితరాలపై ఫిర్యాదులను 08812-355350 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. జిల్లాలో ఇంతవరకు అక్రమంగా మద్యం తరలిస్తున్న 9 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారి నుంచి 207 మద్యం బాటిళ్లను, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన నలుగురు ఉద్యోగులను తొలగించామన్నారు. అధిక ధరలను మద్యాన్ని విక్రయించే దుకాణాల ఉద్యోగులపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం డిపోలు, తయారీ డిస్టిలరీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

1.72 లక్షలు సీజ్



కామవరపుకోట, మే 2 : కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీలలో జంగారెడ్డిగూడేనికి చెందిన కారులో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకు వెళుతున్న వ్యక్తి నుంచి లక్షా 72 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి ఎండీ మొహిద్దీన్ తెలి పారు.ఏలూరు ఎన్నికల ట్రెజరీకు పంపామని చెప్పారు. వీఆర్వో కొయ్యగూర బాబూరావు, పోలీసులు కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, నాగార్జున ఉన్నారు.

ఏలూరు చేరిన నాగాలాండ్ పోలీసులు

ఏలూరు క్రైం, మే 2 : ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం ఏలూరు జిల్లాకు భద్రతా దళాలను పంపించింది. ఇప్పటికే నాలుగు పోలీస్ సబ్ డివిజన్లలో నాలుగు ప్రత్యేక కంపెనీలు నెలరోజుల క్రితమే వచ్చాయి. ఇప్పుడు నాగాలాండ్‌కు చెందిన ఇండియన్ రిజర్వు పోలీస్ కంపెనీ (105 మంది) చేరుకున్నారు. ఏలూరు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి వచ్చిన నాగాలాండ్ ఆర్మ్‌డ్ బలగాలు ఏలూరులోని ఒక కల్యాణ మండపంలో బస చేశాయి. అక్కడకు ఎఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణబాబులు గురువారం వెళ్లి ఆ కంపెనీ బలగాల కమాండర్, డిప్యూటీ కమాండర్‌లతో చర్చించారు. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడానికి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు నాగాల్యాండ్ ఇండియన్ రిజర్వు పోలీసు బలగాలు ఏలూరు వన్ టౌన్ ప్రాంతంలో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, నాగాలాండ్‌కు చెందిన పోలీసు బలగాలు పాల్గొన్నాయి. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసుశాఖ భరోసా కల్పిస్తుందన్నారు. శాంతియుత వాతావరణం కల్పించడానికి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎవరైనా, ఎక్కడా ఎన్నికల నియమనిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని గాంధీమైదానం, రామకోటి సెంటర్, దక్షిణపువీధి బస్టాండ్, వంగా యిగూడెం సెంటర్, కుండీ సెంటర్ ప్రాంతాల్లో కవాతు చేశారు.



ఏలూరు నగరంలో కవాతు నిర్వహిస్తున్న నాగాలాండ్ రిజర్వు పోలీసులు

జగన్‌ది అసమర్థ పాలన

» రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి



ద్వారకాతిరుమలలో పురందేశ్వరి, మద్దిపాటి తదితరులు

ద్వారకాతిరుమల, మే 2: రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిందని ఇందుకు జగన్ అసమర్థ పాలనే కారణమని రాజమహేంద్రవరం కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి దుయ్యబట్టారు. ద్వారకాతిరుమల మండలంలోని మారంపల్లి, రాజుపాలెం, తిరుమలంపాలెం, గొల్లగూడెం, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి తదితర గ్రామాల్లో గోపాలపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుతో కలసి ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో వారికి టీడీపీ జనసేన బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలోని అభివృద్ధి అన్నిరంగాల్లో కుంటుబడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులు సైతం దారిమళ్లాయని విమర్శించారు. కూటమిలో ఉన్న మూడు పార్టీలు పేదలకు న్యాయం చేయాలన్న సంకల్పానికి కట్టుబడి ఉన్నాయన్నారు.





కొయ్యలగూడెం మండలంలో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు

బయ్యనగూడెంలో గ్రేడింగ్ కూలీలతో మాట్లాడుతున్న చిర్రి

ప్రజాసంక్షేమమే కూటమి లక్ష్యం

» పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, మే 2: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని సీతంపేట, బయ్యనగూడెం, సరిపల్లె, పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను భారీ విజయంతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ అమలు జరగాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలన్నారు. ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం : చింతమనేని



పెదపాడులో ప్రచారం చేస్తున్న చింతమనేని

పెదవేగి/పెదపాడు, మే 2 : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమం సాధ్యపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం విజయరాయి, రాయన్నపాలెం, నడిపల్లి, బాపిరాజుగూడెం గ్రామాల్లో ప్రచారం చేశారు. దుగ్గిరాలలో కాపు సంక్షేమసేన ఏలూరు జిల్లా కార్యదర్శి వీరంరెడ్డి రమేష్‌నాయుడు తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. పెదపాడు మండలంలో చింతమనేని ప్రభాకర్, భార్య రాధారాణి, కుమార్తె నవ్య కుమారుడు ప్రేమ్ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

కామయ్యపాలెంలో భూపాల్ ఇంటింటా ప్రచారం

జీలుగుమిల్లి, మే 2:ఎన్నికల ప్రచారంలో భాగంగా కామయ్యపాలెంలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ బావమరిది భూపాల్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ,జనసేన నాయకులు సీమకుర్తి శ్రీనివాస్, బండారు నరేష్ ఉన్నారు.

పోలవరంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి

ద్వారకాతిరుమల, మే 2: రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టను వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, దాని ప్రగతిపై రాష్ట్రప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమలకు వచ్చిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గడప గడపకు కాంగ్రెస్ గ్యారెంటీలు-2024 పేరిట మేనిఫెస్టో ప్రతులను విడుదల చేశారు. గోపాలపురం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సోడదాసి మార్టిన్‌లూథర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలువురు కార్యకర్తలు



టీడీపీలో చేరుతున్న కార్యకర్తలు

కామవరపుకోట, మే 2, కామవర పుకోట మండలం గుంటుపల్లి పంచా యతీ కంఠమనేని వారిగూ డెంలో పలువురు కార్యకర్తలు గురువారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతిన వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, గోరింకదాసు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

పోలవరం, మే 2 : కూటమి అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టిసీమ కమలా నరసింహనిలయం అతిథి గృహంలో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌ను గెలిపించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గూటాల నాయకులు కరిబండి శ్రీను, ఎల్ఎన్‌డీపేట నాయకులు ఇల్లా వెంకటేశ్వరరావు, పోలవరం నాయకులు ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా నాయకులు గ్రంధి బాలకృష్ణ, చిలకా రాంబాబు, గూటాల నాయకులు కరిబండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాసుని దివ్య కల్యాణం



విద్యుత్‌తోరణాలతో ముస్తాబైన కల్యాణ మండపం

ద్వారకాతిరుమల, మే 2: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఆలయ యాగశాలలో హోమాలను జరిపారు. సాయంత్రం అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఎదుర్కోలు ఉత్స వం నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు కల్యాణం ప్రారంభమ వుతుందని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలు, పుష్పమాలికలు, మామిడి తోరణాలతో సుందరీకరించారు.

పుట్టా.. ప్రచారంలో పక్కా

» కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచారంలో దూకుడు

» నియోజకవర్గాల్లో దఫాలవారీగా జనాలతో మమేకం

» ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

ఏలూరు, ఆంధ్రజ్యోతి, మే 2: ఏలూరు జిల్లాలో కూటమి పక్షాన పోటీచేస్తున్న వారంతా పక్కాప్రణాళికలతో దూసుకుపోతున్నారు. పోలింగ్‌కు మరికొద్దిరోజులే గడువు మిగిలి ఉండగా, మండుటెండలను ఖాతరు చే యకుండా మిగతా పార్టీలకు మించిమరీ ప్రజలను కలవడంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ ముందు వరుసలో ఉంటున్నారు.

ప్రతి నియోజకవర్గంలో రోడ్‌షో, ప్రజలతో మమేకం, చిన్నపాటి సభల్లోనూ చురుగ్గా పాల్గొనడం, నియోజకవర్గ సమస్యలను ఒక్కొక్కటిగా ప్రస్తావించడం ఆపై తామంతా కలిస్తే ఏ సమస్య పరిష్కరించబోతున్నాము నిష్పష్టంగా ప్రచార పర్వం అన్నింటిలోనూ మహేష్‌యాదవ్ వివరించటానికి చేస్తున్న ప్రయత్నాలు ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రచారంలోనూ ఎంపీ అభ్యర్థిగా దూసుకుపోవడంలో ముందున్నారు. ఇప్పటికే ఉంగుటూరు, పోలవరం సభల్లో జనసేన అధిపతి పవన్‌కల్యాణ్‌తో కలిసి పాల్గొన్నారు. దెందులూరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రచారసభలోనూ ఆయన విశేష ప్రసంగమే చేశారు. ఈ వారంలోనే కైకలూ రులో జనసేనాని, నూజివీడులో చంద్రబాబు ప్రచార సభలు జరగనున్నాయి. ఈ తరహా కూటమిలో పార్టీ అధినాయకులు తాను పోటీచేస్తున్న లోక్‌సభ స్థానం పరిధిలో ఎక్కడ



పర్యటించినా మహేష్‌యాదవ్ పక్కా ఏర్పాట్లు చేయడం కూటమి అభ్యర్థులను కలుపుకోవడం, క్యాడర్‌కు దిశ, నిర్దేశం చేయటం తమను ఆకట్టుకుంటుందని ఎమ్మెల్యే అభ్యర్థులు చెబుతున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఆయన పర్యటిస్తున్నప్పుడు ప్రత్యేకించి తన మదిలో ఉన్న నిర్దిష్ట ప్రణాళిక, ఏ సమస్యకు తాను గెలిస్తే ప్రాధాన్యత ఇవ్వబోతున్నామో నిష్పష్టంగా ప్రకటించారు. వేలాదిమంది రైతులు ఎదురుచూస్తున్న చింతలపూడి ఎత్తిపోతలను తక్షణం పూర్తిచేస్తానని హామీ ఇవ్వడం ద్వారా రైతులను ఆకట్టుకోగలిగారు. చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి, సాంఘిక సంక్షేమ హాస్టల్ నిర్మాణం, రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలను అందిస్తామని భరోసా ఇవ్వడంతో చింతలపూడిలో మైలేజ్‌ని పెంచుకోగలిగారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ముంపు మండలాలకు నిర్దిష్ట హామీలు, నిర్వాసితులకు రక్షణనిధికి కోటి విరాళం ప్రచారానికి వన్నె తెచ్చాయి. ఏలూరులో నగరాన్ని స్మార్ట్‌సిటీగా చేస్తానని, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం, విద్య, వైద్య, ఉపాధిఅవకాశాలను మెరుగుపర్చటంతో పాటు సామాన్యుడు బతికేలా నగరాన్ని తీర్చిదిద్దుతామంటూ చేసిన ప్రకటన కూడా దాదాపు కలిసొచ్చింది. వాస్తవానికి మహేష్ యాదవ్‌తో పాటు పోటీలో ఉన్న మిగతా ఎంపీ అభ్యర్థులు అందరికంటే కూడా తనకున్న పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యత, పారిశ్రామికవేత్తలతో పరిచయాలు, జాతీయస్థాయిలో అత్యుత్తమ నేతలతో సంబంధాలు ఇవన్నీ కూడా మహేష్‌యాదవ్‌కు కలిసివచ్చేవిగా ఉన్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, రోషన్‌కుమార్‌తో పాటు మిగతా వారంతా బహిరంగంగానే చెబుతున్నారు. మెట్టప్రాంతాలైన నూజివీడులోనూ అక్కడ పార్టీ అభ్యర్థి కొలుసు పార్థసారథితో కలిసి ఇప్పటికే దాదాపు అన్ని మండలాల్లోనూ ప్రకటించారు. కైకలూరులోనూ బీజేపీ అభ్యర్థి తోడుగా ఇప్పటికే నాలుగు మండలాలను చుట్టుముట్టి వచ్చారు. ఆక్వా, కొల్లేరు, విద్యుత్, రోడ్లు ఇక్కడ మౌలిక సదుపాయాలపై అక్కడి ప్రజలందరికి హామీలు ఇచ్చారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లోనూ తక్కువ కాలంలోనే గట్టి పట్టు సాధించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిని తేలికగా తీసుకోకుండా పక్కా కౌంటర్ ఇవ్వడం, హామీల్లో స్పష్టత కూడా ఎంపీ అభ్యర్థికి కలిసొచ్చేవిగా మారాయని కూటమి ఇప్పటికే భావిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఉమ్మడిగా ఏలూరు లోక్‌సభలో గట్టిపట్టు సాధిం చే దిశగానే ఎక్కడా వివాదాలు లేకుండా ఓటర్లను, స్థానికులను ఆకర్షించే విధంగా ప్రచారంలో ఇప్పటికే పైచేయిగా ఉన్నారని అంచనా వేస్తున్నారు.

కూటమికే అత్యధిక ప్రజామద్దతు

» ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మే 2: అత్యధిక ప్రజామద్దతు కూటమికే ఉందని రానున్న ఎన్నికల్లో ఘన విజయం తథ్యమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి స్పష్టం చేశారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ టీడీపీలో చేరిక పర్వం ఊపందుకుంది. అధికార పార్టీలో అణచివేతకు గురవుతున్న వారంతా టీడీపీలో చేరుతున్నారు. ఈసారి గెలుపు కూటమి అభ్యర్థి చంటిదేనని తేటతెల్లం కావడంతో అన్ని పార్టీల నుంచి టీడీపీలోకి వలసలు ఎక్కువయ్యాయి. ప్రజానాయకుడు 16వ డివిజన్‌కు చెందిన డాక్టర్ వైసాంబశివరావు వైసీపీని వీడి భారీ సంఖ్యలో తన అనుచరగణంతో చంటి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ సాంబశివరావు చుట్టుపక్కల 5, 6వ డివిజన్లకు చెందిన పేదప్రజలందరికి ఉచిత వైద్యం చేస్తారన్నారు. 55 ఏళ్ల నుంచి పలు రాజకీయ పార్టీల్లో తన రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. వైసీపీ నాయకుడు ఆళ్ల నాని చర్యలపై విరక్తిచెంది టీడీపీలోకి చేరుతున్నట్టు సాంబశివరావు తెలిపారు. సాంబశివరావు రాకతో కూటమి మరింత బలోపేతం అయిందన్నారు.



ఏలూరు 16వ డివిజన్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న బడేటి చంటి

నిస్వార్థ సేవకు చిరునామా బడేటి కుటుంబం

నిస్వార్థ సేవకు చిరునామా బడేటి కుటుంబమని రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బడేటి చంటిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య 50వ డివిజన్ ప్రజా సంకల్ప యాత్రలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో గురువారం మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుకమ్మ, చంటి భార్య మీన, సోదరి మణులు బుల్లెమ్మ, పద్మావతి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

కూటమితోనే ఉద్యోగాలు, సంక్షేమం

చింతలపూడి కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్

లింగపాలెం/చింతలపూడి, మే 2: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చదువుకున్న ప్రతిఒక్కరికి ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ఇంటిస్థలం, ఇల్లు కట్టుకునేందుకు నిధులు అందిస్తామని చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం కుప్పాలవారిగూడెం, కె.గోకవరం, పాశ్చ్యానగరం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ప్రతి ఒక్కరిని కలుస్తూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. వారు తమ గ్రామాల్లో అభివృద్ధి లేదని.. ఇల్లు కట్టుకోవాలంటే అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటేనే గాని ఇల్లు ఇవ్వమంటున్నారని, పెన్షన్లు కూడా ఇవ్వడం లేదని అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే ప్రతిఒక్కరికి ఇంటిస్థలం, ఇల్లు, తాగునీరు, రోడ్ల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాశ్చ్యానగరం గ్రామంలో సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణతో కలిసి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, ముసునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

రాఘవాపురంలో 200 మంది జనసేనలో చేరిక

చింతలపూడి మండలంలో గురువారం రాత్రి టీడీపీ సీనియర్ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అభ్యర్థి రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, జనసేన నాయకులు చీదరాల మధుబాబు, టీడీపీ నాయకులు మాటూరి వెంకటరామయ్య, నియోజకవర్గ టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీతో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. రాఘవాపురంలో చిన్నంశెట్టి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో 200మంది వైసీపీ నుంచి జనసేనలోకి రావడంతో కండువాకప్పి ఆహ్వానించారు.

రేపు ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు రూరల్, మే 2 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశం ఈనెల 4వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు హోటల్‌గ్రాండ్ ఆర్య సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్ సూర్యనారాయణ విచ్చేస్తారన్నారు. ముఖ్యంగా సీపీఎస్, జీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్దరణ, 12వ పీఆర్సీ సత్వర అమలు, ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ల చెల్లింపు చట్టబద్ధత చేయటం, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాల కేటాయిం పు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాట్లు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు, గ్రామ రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



పంచరైన మున్సిపాల్టీ ట్రాక్టర్ ట్రక్కు

ఏలూరు క్రైం, మే 2 : ఏలూరు నగర పాలక సంస్థకు చెందిన చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టర్ గురువారం మధ్యాహ్నం ఓవర్ బ్రిడ్జిపై జ్యూట్‌మిల్లు సమీపంలో ట్రక్కు టైరు పంచర్ కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అరిగిపోయిన టైర్లతో ఉన్న ఈ ట్రాక్టర్లను ఇంకా వినియోగించడం వల్ల ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ట్రాఫిక్ సమస్యను నియంత్రించారు. మండుటెండలో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డ్రింక్స్ షాపునకు.. ఎంపీడీవో ఆఫీసు కరెంట్



ఎంపీడీవో కార్యాలయం నుంచి కరెంట్ సరఫరా ఇచ్చిన కూల్ డ్రింక్స్ షాపు

పోలవరం, మే 2 : పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి కూల్‌డ్రింక్స్ షాపునకు విద్యుత్ సరఫరా చేయడం పట్ల సర్వత్రా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వెళ్లిన మీడియాకు ఎంపీడీవో ఆఫీసు నుంచి కార్యాలయ ఆవరణ బయట వున్న డ్రింక్స్ షాపునకు కరెంట్ సరఫరా ఇవ్వడం చూసి అధికారి జి.శ్రీనుని వివరణ కోరారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి స్పష్టం చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో కార్యాలయ సిబ్బంది హడావుడిగా విద్యుత్ సరఫరా తొలగించారు. షాపునకు విద్యుత్ సరఫరా చేయడం పట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, మండల స్థాయి నాయకుడి ఆదేశాలతో విద్యుత్ సరఫరా ఇచ్చినట్టు ప్రచారం కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రైం వార్తలు

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 2:వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి రైల్వే గేటు దగ్గరలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉన్నట్టు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందింది. రైల్వే సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి మృతి చెందాడని ప్రాథమికంగా గుర్తించారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కలిగి, కోల ముఖం, నల్లని జుట్టు, సామాన్య దేహదారుఢ్యంతో ఉన్నాడు. మృతుడు నీలం రంగు పొట్టి చేతుల టీషర్టు, బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు 95020 97672కు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా యువకుడికి గాయాలు

ఏలూరు క్రైం, మే 2 :మోటారు సైకిల్‌పై ఒడిశా నుంచి బెంగళూరు వెళ్తూ మార్గమధ్యలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఒడిశాకు చెందిన ప్రకాష్‌కుమార్ ప్రధాన్(35) ఒడిశా నుంచి బెంగళూరుకు మోటారు సైకిల్‌పై బయలుదేరి వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గమధ్యలో గుండుగొలను వద్ద వడదెబ్బ తగిలి అకస్మాత్తుగా మోటారు సైకిల్‌పైనుంచి పడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి వద్ద ఉన్న వివరాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హిందీ నికేతన్ వజ్రోత్సవాలు



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, మే 2:స్థానిక పవర్‌పేటలో 1950వ సంవత్సరంలో పిండెంటి సత్యనారాయణ స్థాపించిన హిందీ నికేతన్ వజ్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు వి.వెంకటస్వామి మాట్లాడుతూ ఒక బోధివృక్షం, ఒక శబర్మతి, ఒక చరిష్మాల కలయిక హిందీ నికేతన్ అని అన్నారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిండెంటి సత్యనారాయణ సేవలు మరువలేనివన్నారు. 75 ఏళ్లల్లో 65 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించారన్నారు. కళాశాల లెక్చరర్ మోహన్‌కుమార్, పూర్వ విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, వెంకటరత్నం, హిందీ పండితులు లక్ష్మణకుమార్, ఉమామహేశ్వరరావు, హిమబిందు, లలితాంబ, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న వైఎస్ విమలారెడ్డి

ఏలూరు క్రైం, మే 2 : ప్రపంచంలో స్వచ్ఛందంగా, స్వతంత్రంగా పనిచేసే ఏకైక సంస్థ రెడ్‌క్రాస్ సంస్థ అని ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ స్వచ్ఛంద బోధకురాలు వైఎస్ విమలారెడ్డి అన్నారు. ఏలూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్ఆర్‌పేటలో రెడ్‌క్రాస్ మెడికల్ షాపు ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాటసారులకు చలివేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, కార్యదర్శి కేబీ సీతారామ్, ట్రెజరర్ రేపూరి శివప్రసాద్, డాక్టర్ స్పందన, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు రామారావు, ఆర్ఎస్ఆర్ బుజ్జి, పీఆర్వో కేవీ రమణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మేడేపల్లి గ్రామస్థులు



బీజేపీలో చేరిన మేడేపల్లికి చెందిన కుటుంబాలు

బుట్టాయగూడెం, మే 2 : వేలేరుపాడు మండలం మేడేపల్లికి చెందిన 30 కుటుంబసభ్యులు గురువారం బుట్టాయగూడెం గ్రామంలో పోలవరం నియో జకవర్గ బీజేపీ కన్వీనర్ కొండపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బీజేపీలో చేరినవారికి ఆయన పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానిం చారు. తొలుత ఓలేటి నాగదుర్గఅనిల్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేలేరుపాడు మండలాధ్యక్షుడు ములకలపల్లి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బాబ్జి, దొమ్మేటి లక్ష్మీజనార్దనరావు, సోము హరినారాయణ, ఓదూరి దుర్గారావు, పావిల వీరకృష్ణ, బొద్దుల శివరాం, కుంజా వెంకటనరసయ్య పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్ల పట్టివేత

లింగపాలెం, మే 2: అక్రమంగా నిల్వఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో గల లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగాపురం గ్రామంలో ఓ వ్యక్తివద్ద 116 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. దాడుల్లో చింతలపూడి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.ఎస్.వి ప్రసాద్, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ అరుణమ్మ, డీటీఎఫ్ ఎస్ఐ మురళీధర్, చింతలపూడి ఎస్ఐ పి.లక్ష్మణరావు, ఆర్.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది జేబులో సెల్‌ఫోన్ అపహరణ

ఏలూరు క్రైం, మే 2 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక న్యాయవాదిని వెనుక నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి భుజంపై కొట్టారు. ఎవరా అని ఆయన వెనుకకు తిరిగేలోపే ఆయన జేబులో ఉన్న సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఏలూరులోని కట్టా సుబ్బారావుతోట, ఏటిగట్టుకు చెందిన న్యాయవాది యార్లగడ్డ గోవర్ధనపరాత్పరరావు బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో మోటారుసైకిల్‌పై కొత్తబస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్‌వైపు వెళ్తుండగా ఫైర్‌స్టేషన్ వద్ద ఒక ఇద్దరు యువకులు వెనుకనుంచి మోటారు సైకిల్ వచ్చి ఆయన భుజంపై కొట్టారు. ఎవరా అని వెనుకకు తిరిగేటప్పటికే ఆయన జేబులో ఉన్న సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. ఆ ఫోన్‌తో పాటు రూ.రెండు వేల నగదు కూడా అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు న్యాయవాది ఫిర్యాదు చేశారు.

1,57,841 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

» జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరు సిటీ, మే 2: జిల్లాలో ఇప్పటివరకు 1,57,841 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మంగళవారం తెలిపారు. జిల్లాలో నేటి వరకు 11,835 మంది రైతుల వద్ద నుంచి రూ.305.78 కోట్లు విలువైన 1,57,841 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 22,561 మంది రైతులకు చెందిన 1,75,184 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలపాలన్నారు. 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910 నంబర్లకు రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

నిబంధనల మేరకు ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నాం

దెందులూరు, మే 2 : దెందులూరు నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దెందులూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ బి.లావణ్యవేణి అన్నారు. గురువారం దెందులూరు ఎన్నిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నియోకవర్గ సహాయ అధికారి జితేంద్రతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 2,24,013 ఓటర్లు ఉన్నారని, 239 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతాయన్నారుర. మంచానికే పరిమితమై పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని 95 మందిని గుర్తించామన్నారు. శనివారం నుంచి ఆరు రూట్లుగా విభజించి వారి ఇళ్లకు అధికారులు వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేయించుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వీరితో పాటు మండలంలో అంగన్వాడీ టీచర్లతో కలిపి ఉద్యోగులు 1,800 ఓట్లుకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చామన్నారు. ఎన్నికల అధికారుల, తహసీల్దార్‌లు ఉన్నారు,

హోం ఓటింగ్‌కు 223 మంది అర్హులు

ఉంగుటూరు, మే 2 : ఉంగుటూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు 223 మంది అర్హులని, వీరి ఓటింగ్ కోసం ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశామని రిటర్నింగు అధికారి ఖాజావలి తెలిపారు. ఫారం 12డిలో అర్జీ చేసుకున్న 223 మందికి మొదటి విడత ఈనెల 3 నుంచి 5 వరకు వారి ఇంటి వద్దకు వెళ్ళి ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మిగిలిన వారికి మే 8, 9 తేదీల్లో హోం ఓటింగ్ కల్పిస్తామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో పనిచేసే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నారాయణపురం హైస్కూలులో ఈనెల 4, 5వ తేదీలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు, మే 2 : పెదపాడు మండలం పెదపాడు సెక్షన్ 33/11 కేవీ పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వున్న రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ న్యూలైన్ల నిర్మాణం, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 3, 4వ తేదీల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

పలువురికి మానవత సాయం

భీమడోలు, మే 2 : భీమడోలు గ్రామంలోని పలువురికి గురువారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాయం అందించారు. స్థానిక వెలంపేట అంగన్‌వాడీ పాఠ శాలకు మానవతా స్వచ్ఛంధ సేవాసంస్థ ఐరన్ ర్యాక్స్‌ను, భీమడోలు ఇందిరా కాలనీలో దివ్యాంగుడు నేతల రమణకు నిత్యావసర సరుకులు, దుస్తులు పూళ్ల గ్రామంలో ఇంటర్ చదువుతూ బ్రెయిన్ వ్యాధితో చికిత్స పొందుతున్న మంచిరెడ్డి తేజశ్వినికి ఐదు వేల రూపాయలు, నిరుపేద మణి, దయాల చంద్రమ్మ, హేమాడ నవదుర్గమ్మలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చైర్మన్ నూకరాజు, కన్వీనర్ సత్యనారాయణ, తుమ్మకుంట రంగా, పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కల్చరల్ డే కార్యక్రమంలో వ్యాయామ విద్యార్థులు, అధ్యాపకులు

గోపన్నపాలెం కాలేజీ విద్యార్థుల కల్చరల్ డే

దెందులూరు,మే 2 : విద్యార్థులు చదువుతో పాటు కల్చరల్ కార్యక్రమాలు చేస్తూ జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి ఉంటూ.. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియాల్ అన్నారు. గురువారం గోపన్నపాలెం వ్యాయామ జూనియర్, సీనియర్ విద్యార్థులు గంగన్నగూడెంలో సాంబశివరావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో కల్చరల్ డే కార్యక్రమం నిర్వహించారు. పలు క్రీడలు, ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు,

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోరు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ముసునూరు, ఏప్రిల్ 2: తాగునీరివ్వ కుంటే ఎన్నికలు బహిష్కారం శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గురువారం నూజివీడు డివిజనల్ పంచాయతీ అధికారిణి ఎం.పీ.ఎన్. సుందరి, ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు రమణక్కపేట ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే ట్యాంకర్ల ద్వారా కాలనీ వాసులకు జరుగుతున్న నీటి సరఫరాను సైతం వారు తనిఖీ చేశారు. కాలనీలో తాగునీటి ఎద్దడికి కారణం మంచినీటి బోరు నుంచి నీటి సామర్థ్యం తగ్గిపోయినట్టు అధికారులు గుర్తించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పర్యవేక్షణలో మోటరును తొలగించి, మరికొన్ని అడుగుల లోతుగా బోరును వేసే పనులను చేపట్టారు.

చెక్ పోస్టు వద్ద నగదు సీజ్

ముదినేపల్లి, మే 2 : సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును బుధవారం రాత్రి ముదినేపల్లి మండలం పెదపాలపర్రు ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్ద అధికారులు సీజ్ చేశారు. ఆ చెక్ పోస్టు అధికారి, మండల పరిషత్ ఏవో కె.రమణబాబు ఆధ్వర్యంలో సిబ్బంది గుడివాడ నుంచి మండవల్లి మండలం కానుకొల్లు బైక్‌పై వెళ్తున్న వారిని తనిఖీ చేయగా, పి.సత్యనారాయణ ప్రసాద్ అనే వ్యక్తి వద్ద రూ.99,970 నగదును గుర్తించారు. తాను గుడివాడలో ఓ వ్యాపారికి మినుములు అమ్మగా వచ్చిన సొమ్మును తీసుకెళ్తున్నట్లు ప్రసాద్ చెప్పినా అందుకు ఆధారాలు ఏమీ చూపించకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అధికారులకు ఇందుకు సంబంధించి న పత్రాలు చూపించి రిలీజ్ ఆర్డర్ తీసుకొస్తేనే నగదును తిరిగి ఇచ్చేస్తామని చెక్ పోస్టు అధికారి రమణ బాబు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముద్దరబోయిన



నూజివీడు, మే 2: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావును నియమిస్తూ అధి ష్టానం నిర్ణయం తీసు కుంది. నూజివీడు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగిన ముద్దరబోయినతో అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, గన్నవరం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా నియమిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. పలువురు టీడీపీ నాయకులు ముద్దరబోయినను కలిసి అభినందనలు తెలిపారు.

ఇస్సాకుపై చర్యలుంటాయి..

నూజివీడు, మే 2: స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన ఆముదాల ఇస్సాకుపై చర్యలు తప్పవని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బీజేపీ నూజివీడు నాయకుడు ఆముదాల ఇస్సాకు పట్ల పార్టీలోని అగ్రవర్ణ నాయకులు ఎవరూ అవమానకరంగా ప్రవర్తించలేదన్నారు. ఆయన పోటీ విషయమై పార్టీ జిల్లా నాయకత్వం రాష్ట్ర నాయకత్వానికి సమాచారం ఇచ్చిందని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

ముదినేపల్లి, మే 2: ముదినేపల్లిలోని అంబేడ్కర్ కాలనీలో వైసీపీ నుంచి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం ఆ కాలనీలో పార్టీ ప్రచారం సందర్భంగా మాల మహానాడు నాయకుడు పాగోలు విజయసాగర్‌తో పాటు పలువురు కార్యకర్తలు నియోజకవర్గ టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జ్ కొడాలి వినోద్, సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కామినేని శ్రీనివాస్ తనయుడు వేణుగోపాల్ సమక్షంలో టీడీపీలో చేరారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, మే 2 : ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీటీసీలు పాల్గొన్నారు. అయితే కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అజెండాను ప్రవేశపెట్టలేదు. ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావుతోపాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న సూరిశర్మ

ఆగిరిపల్లి, మే 2: ఆగిరిపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ వేదపాఠశాల విద్యార్థి రోహిత్ శర్మ కర్నాటక రాష్ట్రం శృంగేరిలో జరిగిన వేద పరీక్షల్లో ద్వితీయస్థానం సాధించాడని పాఠశాల కార్యదర్శి సూరిశర్మ తెలిపారు. విద్యార్థితో పాటు గురువులు సాయికిరణ్, తేజశర్మను కార్యదర్శి శర్మ అభినందించారు.

కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



కైకలూరు, మే 2: కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతీ అధ్యాపకుడు కృషి చేయాలని కాలేజీ ఎడ్యుకేషన్ కమీషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. గురువారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన సౌకర్యాలు, తరగతి గదులు, ల్యాబ్ పనితీరుపై విశ్లేషించారు. అధ్యాపక బృందానికి పలు సూచనలు చేశారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల సంఖ్య పెంచాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి సృజనాత్మకతను పెంపొం దించి డిగ్రీ అనంతరం ఉద్యోగాలు వచ్చేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ ప్రకాష్, అధ్యాప కులు ఆర్. జాలబాబు, నున్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కడు రమణీయం



ఆగిరిపల్లి, మే 2: నెక్కలం అడ్డరోడ్డులోని భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి సప్తమ వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా గురు వారం ఉదయం 10 గంట లకు స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పొట్లూరి కృష్ణారావు, మీనాక్షి దంపతుల చేతుల మీదుగా కల్యాణం జరిగింది. 150 మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామం ముముక్షు జన మహాపీఠాధిపతులు ముత్తేవి గోపాలకృష్ణ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 2: వివాహిత అదృశ్యంపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామానికి చెందిన మడిపల్లి యశ్వంత్, శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లి గ్రామానికి చెందిన మెండా రమ్య గత ఏడాది ఆగస్టులో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో గత నెల 23వ తేదీ రాత్రి యశ్వంత్, రమ్య ఇద్దరూ డాబాపై పడుకున్నారు. తెల్లవారుజామున లేచి చూసేసరికి రమ్య కనిపించలేదని, ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియ లేదని భర్త ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగన్మాయ

నూజివీడు మామిడికి హామీల తెగులు





నూజివీడు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుడిగా జగన్ పాదయాత్రలో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు మరిచిపోయారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రసిద్ధ నూజివీడు మామిడి చేదెక్కింది. 200 ఎకరాల్లో మ్యాంగ్ పల్ప్ యూనిట్ ఏర్పాటు హామీ రైతులకు ప్రయోజనంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశించారు. ఆ దిశగా ప్రభుత్వం, పాలకులు ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు హామీ అమలుకు ప్రయత్నించినా నిరాశే కలిగింది. ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరిస్తానని, మెంటార్లను క్రమబద్ధీకరిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఐదేళ్లలో అమలుకు నోచుకోలేదు. ప్రధానంగా వరి సాగుకు కీలకమైన అవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

\- నూజివీడు

- మ్యాంగో పల్ప్ యూనిట్ అడ్రస్ లేదు
- ట్రిపుల్ ఐటీ సమస్యలు గాలికొదిలేశారు
- రహదారులు అధ్వానం
- ఎత్తిపోతలు పూర్తి చేయలేదు

వైసీపీ పాలనలో నూజివీడు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగింది. కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం గతంలో సీఆర్‌డీఏలో భాగం. ఏలూరు జిల్లాలో విలీనం అనంతరం మారుమూల ప్రాంతంగా మారింది. ఫలితంగా నియోజకవర్గంలో రియల్‌ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతింది. కృష్ణా జిల్లా పరిధిలో అతిపెద్ద డివిజన్‌గా ఉన్న నూజివీడు, ఏలూరు జిల్లాలో కేవలం ఆరు మండలాలకు పరిమితమైంది. కేంద్రీయ విద్యాలయం, మ్యాంగో పల్ప్ యూనిట్ ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైంది. నూజివీడు మున్సిపల్ నిధులను కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాల పేరిట దాదాపు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. మంజూరు కాని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రెండేళ్ల క్రితమే నిధులు ఖర్చు చేయడం విస్మయం కలిగించింది. ఎట్టకేలకు మంజూరైనా ఏర్పాటు చేసే సమయానికి ఎన్నికలు సమీపించాయి.

రహదారులు రివర్స్ టెండరింగ్

టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.40 కోట్లతో ప్రారంభించిన అంతర్గత రహదారులను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు దాటుతున్నా నేటికి నిర్మాణం పూర్తికాలేదు. తెలంగాణ నుంచి గన్నవరం విమానాశ్రయానికి అనుసంధానమయ్యే రహదారులు అధ్వానంగా మారాయి. సత్తుపల్లి - విస్సన్నపేట, నూజివీడు, గన్నవరం రహదారులు ధ్వంసమై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌ను అనుసంధానించే హనుమాన్‌జంక్షన్ - ఈదుల గూడెం, ఈదులగూడెం - మల్లవల్లి రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ఆగిరిపల్లి - నూగొండపల్లి రహదారిపై వంతెన నిర్మాణం, ఆగిరిపల్లి - తోటపల్లి మధ్య వంతెన నిర్మాణం లేక వర్షాకాలం వాగు పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. చాట్రాయి మండలం విస్సన్నపేట - చింతలపూ డి రహదారిలో నరసాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు వరకు సింగిల్‌రోడ్డు మాత్రమే ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదు. చాట్రాయి సెంటర్ నుంచి కొండపర్వ అడ్డరోడ్డు వద్ద ఎం అండ్ కె రోడ్డు డబుల్ రోడ్డుకు మూడేళ్ల క్రితం సర్వే చేశారు. పనులు మాత్రం ప్రారంభించలేదు.

తమ్మిలేరుపై కాజ్‌వే కల

చాట్రాయి మండలం పోలవరం, చింతలపూడి మండలం యడవల్లి మధ్య తమ్మిలేరుపై కాజ్‌వే నిర్మించాలని 50ఏళ్ళ నుంచి ప్రజలు కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. నూజివీడు మండలంలో మీర్జాపురం కేంద్రంగా రామిలేరు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన హామీ అమలు కాలేదు. ముసునూరు మండలంలో రమణక్కపేట, గోపవరం గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారులను రివర్స్‌టెండరింగ్ పేరుతో నిలిపివేశారు.

ట్రిపుల్ ఐటీ సమస్యలు పట్టవా జగనన్నా..




ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగనన్నకు నూజివీడు ట్రిపుల్ ఐటీ సమస్యలు కనిపించాయి. పరిష్కరించేస్తానని హామీ ఇచ్చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సమస్యల కనిపించలేదు. అందుకే పరిష్కారం కాలేదు. మెంటార్లను పర్మినెంట్ చేస్తానని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారు. వారంతా కళ్లలో ఒత్తులేసుకుని ఐదేళ్లు ఎదురు చూశారు. చివరికి జగనన్న వారికి నిరాశే మిగిల్చారు. మ్యాంగ్ పల్ప్ యూనిట్ ఏర్పాటుతో మామిడి రైతులకు ఊతం, స్థానికులకు ఉద్యోగావకాశాలు వస్తాయని ఎదురుచూస్తే మరోసారి ఎన్నికలు వచ్చాయి..!

అప్పటి పనులు.. మళ్లీ శంకుస్థాపన

టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి పైప్‌లైన్, మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ఏర్పాటు పేరుతో గ్రామీణ ప్రాంతాలో ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. తర్వాత కోడ్ అమలుతో పనులు నిలిచిపోయాయి.



చింతలపూడి ఎత్తిపోతలలో భాగంగా తమ్మిలేరుపై చీపురుపల్లి వద్ద అక్విడెక్ట్



ఎత్తిపోతల పథకం నీటి మూట..!

చింతలపూడి ఎత్తిపోతల పథకం హామీ ఉత్తిపోతల నీటి మూటగా మిగిలింది. ప్రతి ఎకరానికి నీరుపారేలా చేస్తానని జగన్ ఇచ్చిన హామీ అమలు కాలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంతో పాటు చాట్రాయి మండలం తమ్మిలేరు జలాశయ అభివృద్ధి, సాగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీటిని తీసుకువస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.4వేల కోట్లతో చింతలపూడి ఎత్తిపోతల పథకం దాదాపు 60 శాతం పనులు పూర్తిచేసింది. ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతలకు పథకానికి నీళ్లొదిలింది.

తమ్మిలేరు జలాశయం అభివృద్ధి లేదు



చాట్రాయి మండలంలోని తమ్మిలేరు జలాశయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో జపాన్ బ్యాంకు నిధులు రూ.16కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలు కాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో టెండర్లు పిలిచి సుమారు రూ.50 లక్షల పనులు చేశారు. అనంతరం బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. తమ్మిలేరు జలాశయం అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

నెరవేరని హామీలు..

- నియోజకవర్గంలో జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు, గత ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.
- ట్రిపుల్ ఐటీ సమస్యలను పరిష్కరిస్తానని, మెంటార్లను పర్మినెంట్ చేస్తానని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు.
- చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, చాట్రాయి మండలం తమ్మిలేరు జలాశయాన్ని అభివృద్ధి, సాగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీటిని తీసుకువస్తానని జగన్ హామీలు నీటిమూటలే.
- 200 ఎకరాల్లో మ్యాంగో పల్ప్‌యూనిట్ ఏర్పాటుద్వారా మామిడి రైతులకు మేలు చేస్తానన్న హామీ స్థల పరిశీలన దశలోనే నిలిచింది.
- వైద్య కళాశాల హామీకి సీఎం హోదాలో జగన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ అని తేల్చడంతో జిల్లా కేంద్రం ఏలూరుకు మెడికల్ కళాశాల తరలిపోయింది
- నూజివీడు నుంచి జిల్లా కేంద్రాలను కలుపుతూ రహదారుల విస్తరణ హామీలు శిలాఫలకాలకే పరిమితం అయ్యాయి.
- నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పంటలను నిల్వ చేయడానికి గోదాములను నిర్మిస్తామని హామీ నెరవేరలేదు.

ఐదేళ్లలో అభివృద్ధి మాటే లేదు



గత ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి మాటే లేదు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని అడిగితే నిధులు లేవనే సమాధానం! అదేమంటే నిధులు లేవని చెబుతున్నారు. గ్రామాల్లో రహదారులు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు కూడా వైసీపీ ప్రభుత్వంలో కల్పించలేని దుస్థితి.

పర్వతనేని సాయికృష్ణ, ముక్కొల్లుపాడు

చింతలపూడిపై నీటి మూటలు



చింతలపూడి ఎత్తిపోతల పథకంపై నేతల హామీలు నీటి మూటలయ్యాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకం రూ.400కోట్లు కాదు, రూ.4వేల కోట్లు అయినా పూర్తి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న దాఖలా లేదు. వైసీపీ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టదు.

\- లింగారెడ్డి వెంకటేశ్వరరావు, రైతు

తమ్మిలేరుపై పాలకుల నిర్లక్ష్యం



పాలకుల నిర్లక్ష్యంతో తమ్మిలేరు ప్రాజెక్టు శిథిలావస్థకు చేరింది. టీడీపీ హయాంలో రూ.16 కోట్లు మంజూరయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో టెండర్లు రద్దుచేసి కాలయాపన చేశారు. ఏడాదిక్రితం పనులు ప్రారంభించి అరకొరగా చేసి ఆపేశారు.

\- చల్లగుళ్ళ శేషగిరిరావు, రైతు



తక్కెళ్లపాడులో కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని ప్రచారం



పిన్నమనేని అభిమానుల ఆత్మీయ సమావేశంలో కామినేని ప్రసంగం

వైసీపీ దౌర్జన్యాలకు గుణపాఠం చెప్పాలి : కామినేని

మండవల్లి, మే 2: కైకలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆయన కుమారులు రౌడీయిజంతో అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులపాలు చేశారని, వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని పత్తిపాడు, తక్కెళ్లపాడు, నుచ్చుమిల్లి, మూడు తాళ్లపాడు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ కైకలూరు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఎక్కడ అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించకుండా తన కుమారుడితో దౌర్జన్యాలకు పాల్పడ్డారని కామినేని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఓట్లు అడిగే హక్కు వారికి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకే జగన్ ప్రభుత్వం ప్రత్యేక జీవోని ప్రవేశపెట్టిందని ఈ జీవో అమలు జరిగితే ఎవరికీ ఆస్తులు దక్కవని, స్థలాలు ఉండవని మొత్తం జగన్‌పరం అవుతాయన్నారు. మీ ఆస్తులు మీరు కాపాడు కోవాలంటే మీ ఆస్తి పత్రాలు మీ దగ్గర ఉండాలంటే జగన్‌ని, కైకలూరులో వైసీపీ అభ్యర్థిని తరిమి కొట్టాలన్నారు. ప్రజల ఆస్తులపై పెత్తనం చేయడానికి వైసీపీ ప్రభుత్వానికి ఏం హక్కు ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రజల ఆస్తులను దొడ్డిదారిన కాజేసేం దుకు జగన్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కామినేని మండిపడ్డారు. తెలుగు దేశం ప్రభుత్వ అధికారంలోకి వస్తేనే ప్రజల ఆస్తుల రక్షణ ఉంటుందని, ఆక్వా రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కామినేని హామీ ఇచ్చారు. మండవల్లి మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణారావు, ముళ్ళపూడి సత్తిబాబు, తక్కెళ్ళపాడు, పత్తిపాడు, మూడుతాళ్ళపాడు, నుచ్చుమిల్లి గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

ముదినేపల్లి: తాను అందరికీ అందుబాటులో ఉంటూ కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని డాక్టర్ కామి నేని శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి ముదినేపల్లిలో నియోజకవర్గ పిన్న మనేని అభిమానుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రత్య ర్థులు తాను అందుబాటులో ఉండనని దుష్ప్రచారం చేస్తున్నారని, తాను నియో జకవర్గ ప్రజల క్షేమానికే అంకితం అవుతానని అన్నారు. ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో విజయం సాధించాల్సిన అవసరం ఉందని, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాద వ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జ్ కొడాలి వినోద్, నాయకులు పిన్నమనేని బాబ్జి, బి. విజయలక్ష్మి, చలసాని జగన్‌మోహన్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పేట కలిదిండిలో గురువారం కూటమి శ్రేణులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామినేని శ్రీనివాస్, పుట్టా మహేష్ యాదవ్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఏసుబాబు, గోవింద్‌లు పాల్గొన్నారు.

నేడు కైకలూరులో పవన్ సభకు తరలి రండి

కలిదిండి, మే 2 : కైకలూరులో శుక్రవారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే వారాహి విజయ భేరి బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పిలుపునిచ్చారు. గురువారం కలిదిండిలో మండల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు సుమారు 1500 బైకులపై ర్యాలీగా కైకలూరు తరలి రావాలన్నారు. కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు మద్దతు గా పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పవన్ సభకు కార్యకర్తల సమాయత్తం

ముదినేపల్లి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం కైకలూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు ముదినేపల్లి మండలం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమవుతున్నారు. ముదినేపల్లి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొడాలి వినోద్, వెంకటేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఏజంట్ల వివరాలివ్వండి : ఆర్డీవో

నూజివీడు, మే 2: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పించిన నేపథ్యంలో ఓట్ల నమోదు ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పక్షాలు తమ ఏజెంట్ల వివరాలను ఇవ్వాలని నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి సూచించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెంట్ల నమోదుకు సంబంధించి ఫామ్-10ను శుక్రవారం ఉదయం 8 గంటల్లోపు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందించాలని ఆమె సూచించారు.

నేడు ఆలయ భూమి కౌలుకు వేలం

ఆగిరిపల్లి, మే 2: ఆగిరిపల్లి శోభనాచల స్వామి ఆలయానికి చెందిన ఆగిరిపల్లి మండలం తాడేపల్లి గ్రామంలో గల ఆర్.యస్. నంబర్ 71-7లో గల ఎకరం 87 సెంట్ల భూమి కౌలు హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆగిరిపల్లి మండలం తాడేపల్లి గ్రామ సచివాలయంలో దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చీకటిలోనే ప్రచారం!

- ఎన్నికల వేళ వెలగని వీధిలైట్లు
- అభ్యర్థుల పాట్లు



వదర్లపాడులో వెలగని వీధిలైట్లు

కైకలూరు, మే 2: ఎన్నికల వేళ వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లో వీధిలైట్లు లేక చీకట్లో వారు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పంచాయతీలను నిధుల కొరత వేధించడంతో కనీసం వీధిలైట్లు కూడా వేయలేని పరిస్థితుల్లో ఆయా సర్పంచ్‌లు, కార్యదర్శులు న్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులన్నీ పక్కదారి పట్టడంతో కనీసం వీధిలైట్లు కూడా వెలిగించలేని పరిస్థితు ల్లో పాలకవర్గాలున్నాయి. ఈ ఎన్నికల ప్రచారాల్లో సైతం అధికార పార్టీలకు చెందిన సర్పంచ్ లు సైతం తమ ఇంటి వద్ద లైటు వెలగడం లేదు, కుళాయిల్లో నీరు రావడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. పేరుకే అధికార పార్టీలో ఉన్నా పంచాయతీలకు నిధు లు లేక పోవడంతో ఇప్పటికే రెండేళ్లుగా ఆయా సర్పంచ్ లు అభివృద్ధి పనులకు సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నారు. లైట్లు వెలగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్ప లేక ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్‌లు సైతం ముఖం చాటేసి వెళ్లిపో తున్నారు. దీంతో అధికార పార్టీకి గట్టి దెబ్బే తగులుతోంది. కనీసం వీధిలైట్లు కూడా వెయ్య లేని స్థితిలో ఉన్నామంటూ పలువురు సర్పంచ్‌లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కైకలూ రు మండలం వదర్లపాడు, వరహాపట్నం, అటపాక, నర్సాయి పాలెం, భుజబలపట్నం, రామవరం, ఆచవరం తదితర గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఎన్నికల వీధిలైట్లు వెలిగించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.